
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


నంద్యాల

జిల్లా వార్తలు



బుధవారం 9 ఏప్రిల్ 2025

రిజిస్ట్రేషన్ల శాఖలో పారదర్శకత అందించేందుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రిజిస్ట్రేషన్ల కోసం క్రయ విక్రయ దారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వారికి అనుగుణంగా నూతన స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. నంద్యాల జిల్లాలో ఈనెల 4వ తేది నుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని ఆమలు చేస్తున్నారు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులకు స్లాట్ బుకింగ్ విధానంపై అవగాహన కల్పించారు.



ఇక రిజిస్ట్రేషన్లు సులభతరం

- మొదలైన స్లాట్ బుకింగ్ విధానం
- నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అమలు

నంద్యాల రూరల్ ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పరిధిలో 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. నంద్యాల, ఆళ్లగడ్డ, బండిఆత్మకూరు, శిరివెళ్ల, ఆత్మకూరు, కోవెలకుంట్ల, అవుకు, బనగానపల్లె, పాణ్యం, నందికొట్కూర్, డోన్, బేతంచెర్ల, ప్యాపిలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈనెల 4వ తేదీ నుంచి ఆమల్లోకి వచ్చింది. దీంతో క్రయ విక్రయాలు చేసే వారిలో ఉత్సాహం వచ్చింది. గతంలో మాదిరి ఎక్కువ కాలం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ముందుగానే మనకు నచ్చిన తేదీల్లో స్లాట్ బుక్ చేసుకుని ఆ తేదిన రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి తగిన పత్రాలు అందజేసి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

ఇప్పటికి వరకు రిజిస్ట్రార్ కార్యాలయాలు నిత్యం రద్దీగా ఉండేవి. రోజులు తరబడి రిజిస్ట్రేషన్ల కోసం వేచి ఉండాల్సి వచ్చేది. సాంకేతిక సమస్యలు తలెత్తివి. రెండు రోజుల అయినా రిజిస్ట్రేషన్ కాకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఇబ్బందిపడేవారు. ఇలాంటి ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం క్రయ విక్రయదారులు కోరుకున్న సమయంలో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు స్లాట్ బుకింగ్ విధానం దోహదపడుతుంది. వీలైన సమయంలో రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు బుకింగ్ తేదీలను ఆన్‌లైన్ ద్వారా ఖరారు చేసుకునే అవకాశం కల్పించారు.

జిల్లాలో వివరాలిలా...

నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో రోజుకు 40 నుంచి 50 వరకు రిజిస్ట్రేషన్లు జరిగేవి. ప్రస్తుత నూతన విధానం ద్వారా రోజుకు 79 స్లాట్స్ బుకింగ్ చేసుకునే వేసులుబాటు ప్రభుత్వం కల్పించింది. దీంతో ప్రభుత్వానికి మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే దీనిపై ప్రజల్లో అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో అధికారులకు, క్రయ విక్రయదారులకు టైం కలిసి వస్తుంది. ఈ విధానం ఆమలు చేసుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అధికారులు కోరుతున్నారు.

వేచి ఉండాల్సిన అవసరం లేదు.....

ప్రజలు వారి దస్తావేజులను మధ్యవర్తిత్వం లేకుండా క్యూ ఆర్ కోడ్ లేదా, పబ్లిక్ డాటా ఎంట్రీ వెబ్ సైట్, ఐజీఆర్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి మూడు విధానాల ద్వారా స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చు. ఈ విధంగా జిల్లాలోని 13 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానం ఆమల్లోకి వచ్చింది. దీంతో ప్రజలు ఎవరి కోసం వేచి ఉండాల్సిన అవసరం లేకుండా వారికి ఇచ్చిన సమయం ప్రకారం కార్యాలయానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. స్లాట్ బుకింగ్ చే సుకున్న వెంటనే వారి వివరాలు సంబంధిత కార్యాలయానికి వెళ్లాయి. దీంతో నిర్ణీత సమయానికి వెళ్లాలి. అలా వెళ్లలేని వారికి స్లాట్ తేదీలు మార్చుకునే వెసులుబాటు ఉంది. ఇందుకు రూ.200 రుసుం చెల్లించాలి. తిరిగి బుక్ చేసుకోవచ్చు.

సద్వినియోగం చేసుకోండి

స్లాట్ బుకింగ్ విధానాన్ని క్రయ విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ విధానం తెలియని వారికి ఈ విధానం గురించి చెప్పాలి. దీంతో ప్రభుత్వానికి ఆదాయంతో పాటు పార దర్శకత ఉంటుంది. వచ్చిన వారికి అవగాహన కల్పిస్తున్నాం.

-చంద్రమౌళి(ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్, నంద్యాల



నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

అభివృద్ధి ప్రణాళికలు రూపొందించండి

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆదర్శ గ్రామీణ యోజన కింద ఎంపికైన గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ రాజకుమారి ఎంపీడీఓలు, సర్పంచ్‌లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్‌హాల్‌లో ఆదర్శగ్రామాల అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎంపికైన 19 గ్రామాల్లో అభివృద్ధిపై ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి ఏడాది గ్రామాల అభివృద్ధికి రూ.20లక్షలు మంజూరు చేయడంతోపాటు అదనంగా అడ్మిన్ కాస్ట్ పరంగా రూ.లక్ష ఇస్తామన్నారు. సీసీ, బీటీరోడ్లకు అధిక ప్రాధాన్యమివ్వాలని, గ్రామంలో పది, ఐటీఐ, డిప్లమో చదివినవారు ఎంతమంది ఉన్నారో గుర్తించి వారినైపుణ్యాభివృద్ధికి స్కిల్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం కల్పించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సీఈవో సుబ్బారెడ్డి, సోషల్ వెల్ఫేర్ అధికారి చింతామణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

ఇరిగేషన్‌ను నిర్వీర్యం చేసిన జగన్

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



మంత్రులతో ఎస్పీ అధిరాజ్, కలెక్టర్ రాజకుమారి

నంద్యాల ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో పాలనలో వైఎస్ జగన్ ఇరిగేషన్ శాఖను నిర్వీర్యం చేశారని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఆయన నంద్యాలలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను తన క్యాంపు కార్యాలయంలో కలిశారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు నీటికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. 2014-19లో రూ. 7లక్షల కోట్ల బడ్జెట్ ఉంటే.. రూ.72 వేల కోట్ల ఇరిగేషన్‌శాఖకు బడ్జెట్ పెట్టామని, 2019-24లో రూ. 12లక్షల కోట్ల బడ్జెట్ ఉంటే.. రూ. 31 వేల కోట్లు మాత్రమే గత వైసీపీ సర్కార్ కేటాయించిందని విమర్శించారు. ఇందులో సగం ఆ పార్టీవారి అవినీతికి స్వాహా అయిందని ఆరోపించారు. గత సర్కార్‌లో రూ. 18వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టడంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. నంద్యాల అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. కుందూ నది బ్రిడ్జితో పాటు విశ్వనగర్ బ్రిడ్జి తదితర పనులను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. నంద్యాలలో సాగునీటికి ఎలాంటి ఇబ్బంది నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆయన మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను మంత్రి నిమ్మల రామానాయుడు పరామర్శించారు. ఆయన సతీమణి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సమక్షంలో మంత్రి నిమ్మల రామానాయుడుని కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా కలిశారు. జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై ఆరా తీసి సమీక్షించారు.

ఎన్టీఆర్ వైద్యసేవలు యథాతథం

కర్నూలు హస్పిటల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్యసేవలు (ఆరోగ్యశ్రీ) పునఃప్రారంభించినట్లు డా. ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కో ఆర్డినేటర్ డా. భాస్కర్ రెడ్డి తెలిపారు. మంగళవారం నుంచి జిల్లాలో ఉన్న 58 నెట్‌వర్క్ హాస్పిటల్స్‌లో యథాతథంగా సేవలు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం రూ.500 కోట్లు బకాయిలను తక్షణమే విడుదలకు అంగీకారం తెలిపిందన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్స్, నెట్‌వర్క్ హాస్పిటల్స్ సమ్మెను విరమించినట్లు తెలిపారు. సోమవారం రాత్రి ఆశా ప్రతినిధులతో జరిపిన చర్చలు సఫలమైనట్లు తెలిపారు.

ఆ ఘటనకు ఏడాది..!

- ఆరోజును జీవితంలో మర్చిపోలేను
- అప్పుడు పునర్జన్మ.. ఇప్పుడు సతీ వియోగం
- రోడ్డు ప్రమాదాన్ని గుర్తు చేసుకున్న మంత్రి ఫరూక్




తీవ్ర రక్తగాయాలతో ఎన్ఎండీ ఫరూక్ (ఫైల్)

నంద్యాల, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సరిగ్గా ఏడాది క్రితం ఇదే రోజున (ఏప్రిల్ 9వతేదీ) ఎన్ఎండీ ఫరూక్ జీవితంలో మర్చిపోలేని ఘటన ఒకటి చోటు చేసుకుంది. గతేడాది ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆయన పాణ్యం మండలంలో రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యారు. నుజ్జునుజ్జయిన కారు నుంచి ఆయన రక్తగాయాలతో బయపడ్డారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆయనకు అది పునర్జన్మ. అయితే గత రంజాన్ మాసంలో రోడ్డు ప్రమాదంలో ఆయన ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఏడాది రంజాన్ మాసంలో ఆయన సతీమణి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాలను మంత్రి ఫరూక్ ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

ఆరోజు అసలేం జరిగిందంటే..

కూటమి నుంచి టీడీపీ అభ్యర్థిగా ఉన్న ఎన్ఎండీ ఫరూక్ గతేడాది ఏప్రిల్ 9వ తేదీన రంజాన్ పండుగ కోసం నంద్యాల నుంచి హైదరాబాద్‌కు కారులో బయలేద్దారారు. పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గ్రామ సమీపంలోకి రాగానే ఉన్నఫలంగా బర్రెలు వాహనానికి అడ్డుగా వచ్చి మంత్రి కారు ప్రమాదానికి గురైంది. ఈ సమయంలో కారు నుజ్జునుజ్జయింది. రక్తగాయాలతో ఉన్న ఫరూక్‌ను స్థానికులు, ఆయన క్యాన్వాయ్ సిబ్బంది ధ్వంసమైన కారు నుంచి బయటకు తీశారు. ఆ సమయంలో ఆయన కారులోని ఎయిర్ బెలూన్ తెరుచుకోవడంతో ప్రాణాలతో బయటపడ్డారు. వెంటనే ఫరూక్‌ను స్థానికంగా చికిత్సలు చేసి హైదరాబాద్‌కు తరలించారు. ఎన్నికల నేపథ్యంలో ఆయన కొద్దిరోజుల్లోనే తేరుకుని ఎన్నికల ప్రచారంలోకి వెళ్లి గెలిచారు. అనంతరం ఆయన్ను సీఎం చంద్రబాబు మంత్రివర్గంలోకి తీసుకుని మైనార్టీ, న్యాయ శాఖను కేటాయించారు. ఇదిలా ఉండగా గతేడాది రంజాన్ నెలలో ఆయన తీవ్రంగా గాయపడి పునర్జన్మ పొందితే.. ఈ ఏడాది రంజాన్ మాసంలో ఆయన సతీమణి షహనాజ్ బేగం కన్నుమూయడం మంత్రి ఫరూక్‌కు తీరని శోకంగా మారింది.

అల్లా దయ, నంద్యాల ప్రజల ఆశీస్సులతో బతికాను



రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే షాక్‌కు గురయ్యాను. అల్లా దయతో పాటు నంద్యాల ప్రజల ఆశీస్సులతోనే బతికాను. పైగా ఎన్నికల సమయం కావడంతో కొంత ఉలికిపాటుకు గురయ్యాను. ఆ సమయంలో నా కుటుంబంతో పాటు నంద్యాల ప్రజలే గుర్తుకువచ్చారు. ఏది ఏమైనా రోడ్డు ప్రమాదం నుంచి ప్రాణాలతో బయట పడటం.. ఆ తర్వాత గాయాలతోనే ఎన్నికల ప్రచారం చేయడం, ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి దక్కడం జీవితంలో మర్చిపోలేను. రోడ్డు ప్రమాదం జరిగిన రంజాన్ మాసంలోనే ఈ ఏడాది నా సతీమణి అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె నా నుంచి దూరం కావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నా. అందరూ కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్టు పెట్టుకోండి, జాగ్రత్తలు పాటించండి. డ్రైవింగ్‌లో ప్రతి ఒక్కరూ రక్షణ చర్యలు పాటించండి. మనకంటూ ఓ కుటుంబం ఉందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోండి. - మంత్రి ఎన్ఎండీ ఫరూక్



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఫరూక్ ప్రయాణించిన కారు (ఫైల్)

వేరు శనగ ధర పతనం

క్వింటం గరిష్ఠంగా రూ.6,439

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయం మార్కెట్ యార్డ్‌లో వేరుశనగ ధరలు భారీగా పతనమయ్యాయి. 15 రోజుల్లో క్వింటాకు వేరుశనగ ధర రూ.450 పైగా ధర తగ్గింది. మంగళవారం వేరుశనగ ధర క్వింటా గరిష్ఠంగా రూ.6,439 పలికింది. వేరుశనగ ధరలు తగ్గడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోరు బావుల కింద సాగవుతున్న వేరుశనగ పంట ఇప్పుడిప్పుడే చేతికి వస్తున్న సమయంలో ఇలా ధరలు తగ్గిపో వడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వమే వేరుశనగకు గిట్టుబాటు ధరతో కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. 21,117 బస్తాలు విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర క్వింటా రూ.3,232, గరిష్ఠ ధర రూ.6,439, సగటున రూ.6,039 పలికింది.



విక్రయానికి వచ్చిన వేరుశనగ దిగుబడి

ఏడాదిలో హంద్రీ నీవా పనులు పూర్తి



మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

- జూన్ 10లోగా విస్తరణ పనులు
- ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో హంద్రీ నీవా ఒకటి
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు
- డీడీఆర్‌సీ సమావేశంలో అధికారులకు దిశానిర్దేశం చేసిన ఇన్‌చార్జి మంత్రి

పత్తికొండ/కర్నూలు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఏడాదిలో హంద్రీ నీవా కాలువ పు లు పూర్తి చేస్తామని జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. పత్తికొండ సమీపంలో జరుగుతున్న పనులను పత్తికొండ, కోడుమూరు ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి, ఏపీ శాలివాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్రలతో కలసి మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై అక్కడే ఇంజనీర్లు, కాంట్రాక్టర్లతో ప్యాకేజీలు వారిగా మంత్రి సమీక్షించారు. పనుల్లో నిర్లక్ష్యం చూపుతున్న ఇంజనీర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వీడి పురోగతిలో వేగం పెంచాలని ఆదేశించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ కరువు సీమకు హంద్రీ నీవా వరం అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో ఐదేళ్ల గంపెడు మట్టి కూడా తీయకుండా నిర్లక్ష్యం చేసిందని అన్నారు. రాయలసీమ రైతులకు జగన్ తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 2024 జూన్‌లో బాధ్యతలు చేపట్టాక హంద్రీ నీవా విస్తరణ, లైనింగ్ పనులు చేపట్టారని అన్నారు. ఈ ఏడాదిలో పనులన్నీ పూర్తి చేస్తామని, జూన్ 10లోగా విస్తరణ పనులు పూర్తి చేస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో హంద్రీనీవా పనులు పూర్తి చేసి రికార్డు సృష్టిస్తుందని అన్నారు. మాల్యాల ప్రధాన ఎత్తిపోతల పథకం నుంచి అనంతపురం జిల్లా జీడీపల్లి వరకు 216.30 కిలో మీటర్లు హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ బ్యాలెన్స్ పనులు ఫేజ్-1 కింద రూ.695 కోట్లతో చేపట్టామన్నారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థలు ఇప్పటికే మట్టి పనులు మొదలు పెట్టారని అన్నారు. ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో రూ.3240 కోట్లు కేటాయించడం చరిత్రలో ఎన్నడూ జరగలేదన్నారు. హంద్రీనీవా కాలువ పూర్తి చేసి... కాలువ పొడువున ఉన్న నియోజకవర్గాల్లో అన్ని చెరువులు నింపి రైతులను ఆదుకుంటామని వివరించారు. పత్తికొండ నియోజకవర్గంలో 70 చెరువులకు నీరు ఇస్తున్నామని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో హంద్రీ నీవా విస్తరణ పనులు రూ.1,030 కోట్లతో చేపట్టి 84 శాతం పూర్తి చేస్తే.. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. రాయలసీమలో ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి పల్లెకు స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు.



పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కుళ్లిపోతున్న శవాలు

మార్చురీ వరండాలో ఫ్యాన్ల కింద ఉన్న మృతదేహాలు



- మార్చురీలో పని చేయని ఫ్రీజర్లు..
- మృతదేహాలు బెంచి పైనే..
- మార్చురీలో దారుణ పరిస్థితులు

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వరండాలో బెంచీలు, టేబుళ్లు, ఫ్యాన్ల కింద ఉంచుతున్నారు. కొన్ని మృతదేహాలను నేలపైనే ఉంచుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో ఫ్రీజర్లు చాలా ముఖ్యం. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో మూడు ఫ్రీజర్లు ఉన్నాయి. ఒక్కో ఫ్రీజరులో ఆరు మృతదేహాలను ఉంచవచ్చు. ఏడాది కింద ఒక ఫ్రీజర్, నెలన్నర క్రితం ఒకటి, 15 రోజుల క్రితం మరోటి పని చేయకుండా పోయాయి. రూ. లక్షలు వెచ్చించి ఫ్రీజర్లను ఆసుపత్రి అధికారులు కొనుగోలు చేశారు. వీటి మరమ్మతులను కంపెనీ నిర్వహిస్తుంది. అయితే కంపెనీ ఈ మూడు ఫ్రీజర్లు చెడిపోయి ఇంత కాలమైనా మరమ్మతు చేయలేదు. ఫోరెన్సిక్ మెడిసిన్, ఆసుపత్రి అధికారుల నిర్లక్ష్యంతో మృతదేహాలను ఫ్యాన్ల కింద ఉంచి చేతులు దులుపుకుంటున్నారు. రాయలసీమ జిల్లాల నుండే కాక ప్రకాశం, తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల, వనపర్తి, జిల్లాల నుంచి యాక్సిడెంట్లు, ఆత్మహత్యలు, గుర్తు తెలియని మృతదేహాలు కర్నూలు జీజీహెచ్ మార్చురీకి వస్తుంటాయి. ఈ శవాలను భద్రపరిచేందుకు ఫ్రీజర్ బాక్సులు ఎంతో ముఖ్యమైనవి. శవాలు కుళ్లిపోకుండా మార్చురీలోని ఫ్రీజర్ మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలతో శరీరాన్ని గడ్డకట్టేలా చేస్తాయి. ఇటువంటి ఫ్రీజర్లను లక్షలు వెచ్చించి కొనుగోలు చేసినా, ఆసుపత్రి అధికారుల నిర్లక్ష్యంతో మూలనపడ్డాయి.


మార్చురి

మార్చురీలో అధ్వానం

కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి ప్రతిరోజు 6 నుంచి 7 మృతదేహాలు వస్తుంటాయి. ఇక సోమ, మంగళవారాల్లో ఈ సంఖ్య మరీ ఎక్కువగా ఉంటుంది. రోడ్డు ప్రమాదంలో మరణించిన వారు, ఆత్మహత్యలు చేసుకున్నవారు, అనాథ శవాలు, ఎంఎల్‌సీ, నాన్ ఎంఎల్‌సీ కేసుల్లో మృతదేహాలు మార్చురీకి వస్తుంటాయి. ప్రమాదంలో మరణించిన వారి శవాలకు మార్చురీలో ఫోరెన్సిక్ వైద్యులు పోస్టుమార్టం నిర్వహించాలి. అంత వరకు మృతదేహాలను భద్రపరిచే ఫ్రీజర్లు పని చేయక పోవడంతో వరండాలోనే ఫ్యాన్ల కింద వదిలేస్తున్నారు. ఫ్రీజర్లు లేకపోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది.

ప్రతి నెల 150 మృతదేహాలు

ప్రతిరోజూ ఆరు నుంచి ఏడు దాకా మృతదేహాలు మార్చురీకి వస్తుంటాయి. ప్రతి నెలా 150 నుంచి 160 మృతదేహాలను ఫోరెన్సిక్ వైద్యులు పోస్టుమార్టం నిర్వహిస్తుంటారు. ఇక ప్రతి సంవత్సరం 1500 దాక మృతదేహాలను మార్చురీలో భద్రపరుస్తుంటారు. వాక్ ఇన్ కూలర్ ఏడాది కాలంగా ఒక బాడీ ఫీజర్ రెండు నెలలుగా, మరో ఫీజర్ 15 రోజులుగా ఇంకో ఫీజర్ 7 రోజులుగా పని చేయడం లేదు.

ఎలుకలు, పందికొక్కులు

కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎలుకలు, పందికొక్కులు స్వైర విహారం చేస్తున్నాయి. గత కొద్ది రోజులుగా మార్చురీ గదిలో ఫ్రీజర్లు పని చేయకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. మార్చురీ ఆవరణ చుట్టూ అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. మృతదేహాలను మార్చురిలో ఉంచడం వల్ల రాత్రిపూట ఎలుకలు, పందికొక్కులు కరుస్తున్నాయి. కొన్ని అనాథ శవాలకు చీమలు పడుతున్నాయి.


పని చేయని ఫ్రీజర్లు

నిరూపయోగంగా మారాయి

కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో వాక్ ఇన్ కూలర్ ఫీజర్లు పని చేయడం లేదు. దీంతో ప్రతిరోజూ వచ్చే మృతదేహాలను సెప్టిక్ మార్చురీలో ఫ్యాన్ల కింద ఉంచుతున్నారు. మూడు ఫీజర్లు, వాక్ ఇన్ కూలర్ కూడా మూలన పడటంతో మృతదేహాలు, అనాథ మృతదేహాలు కుళ్లిపోతున్నాయి. దీంతో ఎంఎల్‌సీ లీగల్ కేసులకు పోస్టుమార్టం చేయడం ఫోరెన్సిక్ వైద్యులకు కష్టంగా మారింది. మెడికో లీగల్ కేసులను త్వరగా పోస్టుమార్టం చేస్తున్నా దూర ప్రాంతం నుంచి వచ్చే కేసులకు పోలీసులు పంచనామా ఆలస్యం కావడంతో రెండు రోజుల సమయం పడుతుంది. ఈలోగా మృతదేహాలు కుళ్లి దుర్వాసన వస్తున్నాయి.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మార్చురీలో ఉన్న మూడు బాడీ ఫ్రీజర్లు పని చేయడం లేదు. ఈ విషయాన్ని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లాం. వాక్ ఇన్ కూలర్ ఫీజర్లు మరమ్మతుల కోసం ప్రిన్సిపాల్ కాలేజీ డెవలప్‌మెంట్ సొసైటీ కింద రూ.2.70 లక్షల నిధులను మంజూరు చేశారు. ఫ్రీజర్ల మరమ్మతుల కోసం బ్లూస్టార్ కంపెనీ వారితో సంప్రదించి సమస్య పరిష్కరిస్తాం.

- డాక్టర్ టి.సాయిసుధీర్, ప్రొఫెసర్ అండ్ హెచ్‌వోడీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కర్నూలు మెడికల్ కాలేజీ



పెద్దాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు

- రూ.61 లక్షల విలువైన 2డీ ఎకో కలర్ డాప్లర్ యంత్రాన్ని ప్రారంభించిన మంత్రి


2డీ ఎకో కలర్ డాప్లర్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

కర్నూలు హాస్పిటల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్థాయిలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టీజీ భరత్ తెలిపారు. మంగళవారం సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోని కార్డియాలజీ విభాగంలో సీడీఎస్ నిధుల కింద రూ.61 లక్షలతో ఏర్పాటు చేసిన 2డీ ఎకో కలర్ డాప్లర్‌ను మంత్రి, కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కే. వెంకటేశ్వర్లుతో కలిసి ప్రారంభించారు. అనంతరం కార్డియాక్ క్యాత్‌ల్యాబ్‌ను మంత్రి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాకు పెద్ద దిక్కులా ఉన్న కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను 2029 నాటికి కార్పొరేట్ స్థాయి హాస్పిటల్‌గా అభివృద్ధి చేస్తామని చెప్పారు. రాష్ట్రానికి ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ వాటిని అధికమించి సరికొత్త వైద్యపరికరాలను ఆసుపత్రికి సమకూర్చుతున్నట్లు తెలిపారు. ఈ నెల 19వ తేదీన స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌ను ప్రారంభించడానికి వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ యంత్రం నెలలోపు పిల్లలకు పరీక్షించడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. కార్డియాలజీ ప్రొఫెసర్ డా.చంద్రశేఖర్ మాటాడుతూ 2డీ ఎకో కలర్ డాప్లర్ మిషన్ మెడికల్ కాలేజీ డెవలప్మెంట్ నిధుల ద్వారా కొనుగోలు చేశామని చెప్పారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ, కార్డియాలజీ ఇన్‌చార్జి హెచ్‌వోడీ డా.లక్ష్మీబాయి, డిప్యూటీ సూపరింటెం డెంట్లు డాక్టర్ డి. శ్రీరాములు, డా. సీతారామయ్య, సీఎస్ఆర్ఎంవో పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో మే, జూన్ 2024లో జరిగిన డిగ్రీ 2, 4వ సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. ఇన్‌చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ వి. ఉమా ఆదేశాల మేరకు వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచామని, విద్యార్థులు వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు. 2వ సెమిస్టర్‌లో 1636కు 638, 4వ సెమిస్టర్‌కు 1752 మంది పరీక్షలు రాయగా 627 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

11న నంద్యాలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నంద్యాల రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 11న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ నంద్యాలకు రానున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు తెలిపారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ఇంటి స్థలాల అర్జీదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సమితి పిలుపు మేరకు గత మూడు నెలల నుంచి దశల వారిగా ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరుతూ అర్జీదారులతో ఆందోళన కార్యక్రమం చేపడతామన్నారు. మండలాల్లో తహసీల్దార్లకు వ్యక్తిగత అర్జీలు సైతం ఇప్పించామన్నారు. పేదల సమస్యలపై చర్చించేందుకు రామకృష్ణ నంద్యాలకు రానున్నట్లు తెలిపారు.


మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

- ఉమ్మడి కర్నూలుపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి
- ప్రజా సమస్యలను పరిష్కరించండి
- డీడీఆర్సీ సమావేశంలో ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు



కర్నూలు కలెక్టరేట్/కర్నూలు ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాను అన్ని రంగాల్లో సంపూర్ణ అభివృద్ధి సాధించేందుకు సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని జిల్లా ఇన్‌చార్జి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. మంగళవారం జిల్లా అభివృద్ధి సమీక్షా మండలి (డీడీఆర్‌సీ) సమావేశం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధ్యక్షతన జరిగింది. ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లాకు చెందిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యేలు గౌరు చరిత, బీవీ జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, డాక్టర్ పార్థసారధి, బి.విరూపాక్షి తదితరులు హాజరయ్యారు. జిల్లాలో ఇరిగేషన్, వ్యవసాయం, రహదారులు, పారిశ్రామిక అభివృద్ధి.. వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గాల్లో నెలకొన్న వివిధ సమస్యలు, అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేలు డీడీఆర్‌సీ దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యేలు తీసుకొచ్చిన పలు సమస్యలు అక్కడే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ పేదరిక నిర్మూలనకు సంబంధించి పీ-4 అమలులో కర్నూలు జిల్లా ముందు ఉందన్నారు. పీ-4లో భాగంగా దారిద్రరేఖకు దిగువన ఉన్న కుటుంబాలను గుర్తించి బంగారు కుటుంబాలుగా తీర్చిదిద్దాలని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లో అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెడుతున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పరిశ్రమలు తరిమేస్తే.. కూటమి ప్రభుత్వం పరిశ్రమలు తెస్తోందన్నారు. కర్నూలు జిల్లాకు సాగునీటి కోసం, విద్యావ్యవస్థలో నాణ్యమైన విద్య కోసం యువనేత, మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ జిల్లాను పారిశ్రామికంగా, ఇరిగేషన్ పరంగా అభివృద్ధి చేసి కరువు నివారణ కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇరిగేషన్ మంత్రిగా నిమ్మల రామానాయుడు, పరిశ్రమల మంత్రిగా తాను ఆ రెండు విభాగాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్తామన్నారు. తద్వార ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడుతాయని వివరించారు. ఈ సమావేశంలో కుడా చైర్మన్ సోమిశెట్టి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యే తమ అభిప్రాయలను డీడీఆర్సీ దృష్టికి తెచ్చారు.

కన్నయ్య నాయుడుతోనే తుంగభద్ర జలాలు



రిటైర్డు ఇంజనీర్ కన్నయ్య నాయుడు వల్ల తుంగభద్ర డ్యాం గేట్లు మరమ్మత్తులు చేసి డ్యాం నుంచి 2 టీఎంసీల నీరు ఈ వేసవిలో జిల్లాకు రావడం చాలా సంతోషకరం. రాయలసీమ బిడ్డగా ముఖ్యమంత్రి ఆర్డీఎస్, గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులను పూర్తి చేసే ఉద్దేశంతో ఉన్నారు. గురు రాఘవేంద్ర ప్రాజెక్టులో మోటార్లు దొంగతనం జరిగింది. ఇప్పుడు అక్కడ కూడా రిపేరీ పనులు జరుగుతున్నాయి. ఎమ్మిగనూరుకు జీవనాధారమైన గాజులదిన్నె ప్రాజెక్టుకు ఇంకా భూసేకరణ సమస్య ఉంది. దీనిని పరిష్కరించండి. అలాగే గువ్వలదొడ్డి చెరువుకు 20 సంవత్సరాల నుంచి ఏ మాత్రం సహాయం చేయడం లేదు. ఎమ్మిగనూరు నియోజకవర్గ పాఠశాలలో డిజిటల్ స్క్రీన్స్ పని చేయడం లేదని వాటిని మార్చండి.

- జయనాగేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే, ఎమ్మిగనూరు

రైతులను ఆదుకోండి



ఓర్వకల్లు, కల్లూరును కరువు మండలాలుగా ప్రకటించారు. ఈ ప్రాంతాల్లో శనగ పంట ఎక్కువ మోతాదులో సాగు చేశారు. వాతావరణ పరిస్థితుల వల్ల పంట దక్కక రైతులు చాలా నష్టపోయారు. వారిని ఆదుకోవాలి. గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలి. అలగనూరు రిజర్వాయరుకు నిధులు కేటాయించండి. ఉలిందకొండ చెరువు, కొలంపల్లి తండా చెరువులను నింపాలి.

- గౌరు చరిత, ఎమ్మెల్యే, పాణ్యం

చెక్‌డ్యాంలు మంజూరు చేయండి



ఆదోనికి నీళ్ల తెచ్చే కార్యక్రమాలను చేపట్టండి. ఆదోని నియోజకవర్గానికి నాబార్డు కింద చెక్‌డ్యాంలు మంజూరు చేయండి. మంత్రి, కలెక్టర్ జోక్యం చేసుకుని ఆదోని నియోజకవర్గాన్ని కూడా ప్రతిపాదనల్లో చేర్చాలి. ప్రైవేటు స్కూళ్ల ఫీజుల దోపిడీ వల్ల మధ్య తరగతి వారు నలిగిపోతున్నారు. దీనిని అరికట్టండి. అలాగే ప్రైవేటు విద్యాసంస్థల్లో విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి పేదలు చదువుకునే అవకాశాన్ని ఇవ్వాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు పిల్లలను ఒకటో తరగతిలో మాత్రం చేర్చుకుని ఆ తర్వాత 2, 3 తరగతుల్లో ఫీజులు కట్టాలని ఇబ్బంది పెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రధానమంత్రి ఫొటోలు ఉండేలా ఆదేశాలు ఇవ్వండి.

- డాక్టర్ పార్థసారధి, ఎమ్మెల్యే, ఆదోని

జొన్నగిరి చెరువుకు నీరివ్వండి



2018లో 68 చెరువులు నింపే కార్యక్రమం ప్రారంభమైంది. మన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని చెరువులను నింపాం. అయితే ఈ ప్రాజెక్టుకు సంబంధించి శంకుస్థాపన చేసిన జొన్నగిరి చెరువుకు మాత్రం నీటిని ఇవ్వలేకపోతున్నాం. ఈ చెరువుకు నీరు ఇచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా పందికోన రిజర్వాయర్ పనులు 50 శాతమే పూర్తయ్యాయి. ఎడమవైపు లిఫ్టు ఏర్పాటు పనులను కూడా పూర్తి చేస్తే 3 అసెంబ్లీ నియోజకవర్గాలకు నీటి సమస్య ఉండదు.

- కేఈ శ్యాంబాబు ఎమ్మెల్యే, పత్తికొండ

తాగునీటి సమస్యను పరిష్కరించండి



కోడుమూరులో పది రోజులకు ఒకసారి తాగునీరు వస్తున్నాయి. చుట్టూ నీళ్ల ఉన్నా కోడుమూరులో నీటి సమస్య తీవ్రంగా ఉంది. అదేవిధంగా దేవమ్మమడుగులో తెలంగాణ వారు అక్రమంగా ఇసుక తరలించుకుపోతున్నారు. దీంతో నీటి సమస్య ఏర్పడుతోంది. ఇసుక అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలి.

- బొగ్గుల దస్తగిరి, ఎమ్మెల్యే, కోడుమూరు

సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి



వేదవతి ప్రాజెక్టు మొత్తం రూ.1900 కోట్లతో చేపట్టాల్సి ఉండగా.. అందులో ఇప్పటికి రూ.110 కోట్లు పనులు జరిగాయి. ఆ ప్రాజెక్టు పనులు పూర్తి చేసినట్లయితే 80వేల ఎకరాలకు ఇరిగేషన్ నీటిని ఇవ్వగలం. ఉమ్మడి జిల్లాలో 68 మైక్రోఇరిగేషన్ ట్యాంకులు ఉన్నాయి. అందులో కర్నూలు జిల్లాలో 35 ట్యాంకులు ఉంటే 33 ట్యాంకులను మార్చి 15వ తేదీ నాటికి అన్ని చెరువులను నీటితో నింపడం జరిగిందన్నారు. పందికోన రిజర్వాయర్‌కి రూ.250 కోట్లు ఖర్చు చేసినట్లయితే 40వేల ఎకరాలకు నీరు ఇవ్వవచ్చు. 2 నెలల్లో హంద్రీలో జంగిల్ క్లియరెన్స్ చేసేలా చర్యలు తీసుకుంటాం.

- రంజిత్ బాషా, కలెక్టర్, కర్నూలు

కోల్డ్ స్టోరేజీ నిర్మాణాన్ని పూర్తి చేయండి



మిర్చి పంట అధికంగా పండించడం వల్ల నిల్వ చేసుకోవడం కష్టంగా ఉంది. రైతులు గుంటూరుకు వెళ్లి స్టోర్ చేసుకోవాల్సిన పరిస్థితి. కర్నూలు మార్కెట్ యార్డులో అసంపూర్తిగా ఉన్న కోల్డ్ స్టోరేజీని వెంటనే పూర్తి చేయాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో వేదవతి, ఆర్డీఎస్, గుండ్రేవుల ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి. అలాగే హెచ్ఎస్ఎస్ఎస్ కాలువను వెడల్పు చేసే కార్యక్రమం జరుగుతున్నందున, కాలువకు స్లూయిస్‌లు పెట్టి గ్రామాలకు నీటిని కేటాయించాలి. కేఆర్ఎంబీ కార్యాలయాన్ని కర్నూలులోనే ఉంచేలా చర్యలు తీసుకోవాలి.

- బస్తిపాటి నాగరాజు, ఎంపీ, కర్నూలు

భూమి కోసం...


తహసీల్దార్‌ను నిలదీస్తున్నమహిళ

- కోడుమూరు తహసీల్దార్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం
- ఇప్పటికే విడతలవారీగా రూ.లక్ష తీసుకున్న వీఆర్వోలు
- తహసీల్దార్‌కు రూ.10వేలు ఇచ్చా • బాధితురాలి ఆరోపణ

కోడుమూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం రెవెన్యూ అధికారుల వద్దకు తిరిగి విసిగిపోయిన ఓ మహిళ ఆత్మహత్యకు యత్నిం చింది. ఇప్పటికే రూ.లక్ష దాకా ఇచ్చుకున్న ఆ మహిళ ఇక చేతకాక నిస్సహాయ స్థితిలో ఏకంగా తహసీల్దార్ ఎదుటే పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించిన సంఘటన మంగళవారం కోడు మూరు మండలంలో చోటు చేసుకుంది. కోడు మూరు మండలంలో పని చేస్తున్న ముగ్గురు వీఆ ర్వోలు తనను మానసికంగా వేధించడమే కాకుండా అసభ్యకరంగా ప్రవర్తించి ఎక్కడ పడితే అక్కడ చేతులు వేసి తమ కోరిక తీర్చాలని చిత్రహింసలకు గురి చేస్తున్నారని ప్యాలకుర్తి గ్రామానికి చెందిన హైమావతి అనే మహిళ ఆరోపించారు. అంతే కాకుండా తన భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కించేందుకు ఇప్పటికే రూ.లక్ష దాకా డబ్బులు తీసుకున్నారని ఆమె వాపోయింది. ఈ విషయాన్ని తహసీల్దార్‌కు చెప్పినా పట్టించు కోలేదని ఆవేదనకు గురై మంగళ వారం ఏకంగా తహసీల్దార్ వెంకటేశ్ నాయక్ ఎదుట పురుగుల మందు తాగేందుకు ప్రయత్నిం చింది. అయితే తహసీల్దార్ ఆమెను అడ్డుకుని చేతిలోని పురుగుల మందు బాటిల్‌ను లాగేసి ఆమెకు సర్దిచెప్పారు.

'రూ.10వేలు ఎందుకు తీసుకున్నావ్..'

ఓపిక నశించిన హైమావతి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్ వెంకటేశ్ నాయక్‌పై ప్రశ్నల వర్షం కురిపించింది. ఫైల్ కలెక్టర్ కార్యాలయానికి పంపించాలని నా దగ్గర రూ.10వేలు ఎందుకు తీసుకున్నావని ఆమె నేరుగా నిలదీసింది. రూ.10వేలు తీసుకొని కలెక్టర్ ఆఫీసుకు తన ఫైల్ ఎందుకు పంపించలేదని అడిగిన ప్రశ్న లకు తహసీల్దార్ సమాధానం చెప్పకుండా దాటవేశారు. భూమిని ఆన్‌లైన్‌లో ఎక్కిస్తామని ముగ్గురు వీఆర్వోలు తన దగ్గర రూ.లక్ష తీసుకొని, రోజూ కార్యాలయం చుట్టూ తిప్పుకొంటున్నా రన్నారు. తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారని తెలిపింది. డబ్బు తీసుకొని చివరకు తమ కోరిక తీర్చాలని వేధిస్తున్నారని సిగ్గు విడిచి తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించింది. అయినా వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఇది తహసీ ల్దార్ కార్యాలయమేనా అంటూ ఆగ్రహం వెళ్లగక్కింది.

12 ఏళ్లుగా భూమి కోసం పోరాటం

చాకలి హైమావతి అనే వివాహిత కోడుమూరులో నివాసం ఉంటోంది. తండ్రి పెద్ద సవారికి ఇద్దరు భార్యలు. రెండవ భార్య రాములమ్మకు హైమావతి సంతానం. తండ్రి పెద్ద సవారికి ప్యాలకుర్తి గ్రామంలో 9ఎకరాల భూమి ఉంది. తండ్రి ఆస్తిలో తనకు సగం హక్కు ఉందని పెద్దసవారి మొదటి భార్య కుమారుడు లక్ష్మన్నపై హైమావతి పోరాటం మొదలు పెట్టింది. ఇందులో భాగంగా 2011 కోర్టును ఆశ్రయించింది. 12 సంవత్స రాలు పోరాట అనంతరం ఉన్న ఆస్తిలో సగం భాగం హైమావ తికి చెందుతుందని 2023లో కోర్టు తీర్పు ఇచ్చింది. నాటి నుంచి నేటి వరకు కార్యాలయానికి తిరగని రోజంటూ లేదు.



ఉద్యోగం నుంచి తొలగించాలి

నాలుగు ఎకరాల భూమిని ఆన్‌లైన్ చేస్తానని రూ.లక్ష తీసుకున్నారు. అంతటితో ఆగకుండా అసభ్యకరంగా ప్రవర్తించారు. నన్ను వేధించిన ముగ్గురు వీఆర్వోలను ఉద్యోగం నుంచి తొలగించాలి. నా నుంచి రూ.10 వేలు తీసుకుని ఎలాంటి న్యాయం చేయని తహసీల్దార్‌పై కూడా కలెక్టర్ కఠిన చర్యలు తీసుకోవాలి. లేకుంటే నాకు ఆత్మహత్యే గతి. **- హైమావతి, బాధితురాలు**

పోలీసులతో విచారణ జరిపిస్తాం

హైమావతి ఆరోపణలపై విచారణ చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేశాను. విచారణలో నిర్ధారణ అయితే కేసులు నమోదు చేయాలని పోలీసులను కోరాను. హైమావతి పొలం ఫైల్ కోడుమూరు తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ లేదు. ఉన్నతాధికారుల సమక్షంలో పెండింగ్ ఉంది. కోర్టు ఆదేశాలకు లోబడి ఉన్నాం. **- వెంకటేశ్‌నాయక్, తహసీల్దార్, కోడుమూరు**

యువతి ఆత్మహత్య

కర్నూలు క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ముజఫర్‌నగర్‌లో అనారోగ్యంతో దివ్య (20) అనే యువతి ఆత్మహత్య చేసుకుంది. దివ్య తన తల్లిదండ్రులు సుధాకర్, ప్రభావతిలతో పాటు కూలీ పనులు చేస్తుంటుంది. ఈమె గత కొద్ది కాలంగా మైగ్రేషన్ తలనొప్పితో బాధపడుతున్నది. మంగళవారం ఇంట్లో రేకులషెడ్డుకు ఉన్న పైపుకు చున్నీతో ఉరి వేసుకుని కనిపిం చింది. తల్లిదండ్రులు, బంధువులు తలుపులు పగులకొట్టి దివ్యను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే దివ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధుసూదన్ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి


మహ్మద్ రసూల్(ఫైల్)

వెల్దుర్తి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామళ్లకోట గ్రామానికి చెందిన యువరైతు మహ్మమ్మద్ రసూల్ (21) వ్యవసాయం చేస్తూ జీవనం చేస్తున్నాడు. తనకున్న ఎకరన్నర పొలంలో కనకాంబరాల పూలను సాగు చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే మంగళవారం ఉదయం కూడా పొలంలో కనకాంబరాలకు నీళ్లు కట్టేందుకు వెళ్లాడు. మోటార్ స్టార్టర్ ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన పక్క పొలాల రైతులు చికిత్స నిమిత్తం వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామ నాయకుడు రామకృష్ణాచారి యువరైతు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఎల్లెల్సీలో పడి బాలుడి మృతి

- కన్నీరు మున్నీరైన కుటుంబసభ్యులు

పెద్దకడుబూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లెల్సీలో ప్రమాదవశాత్తుపడి ఓ దివ్యాంగుడు మృతిచెందాడు. ఈ ఘటన పెద్దకడబూరు మండలం చిన్నకడబూరు గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన బొడ్డు చిన్న హనుమంతు, లక్ష్మిలతో పాటు, మాటలు రాని వారి కుమారుడు హనుమేష్(9) ఎల్లెల్సీ పక్కన ఉన్న పొలానికి వెళ్లారు. తల్లిదండ్రులు పొలం పనులలో నిమగ్నం ఉండగా కూమారుడు సైకిల్ తొక్కుతూ ఆడుకుంటున్నాడు. అయితే ఎంత సేపటికి కూమారుడు తిరిగి రాక పోవడంతో తల్లిదండ్రులకు అనుమానం వచ్చింది. ఎల్లెల్సీ గట్టున సైకిల్ కనిపించింది. ప్రమాదవశాత్తు హనుమేష్ కాలువలో పడ్డాడు. బాలుడికి మాటలు రాకపోవడంతో తల్లిదండ్రులు గుర్తించలేకపోయారు. గ్రామస్తులు కాలువలో గాలించారు. అప్పటికే బాలుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- బావిలో మునిగి యువకుడి మృతి

పెద్దకడుబూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హెచ్.మురవణి గ్రామంలో బావిలో ఈతకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలివీ.. కల్లూరు మండలం తనడకనపల్లె గ్రామానికి చెందిన కురువ మధు(28) తన అత్తమామల గ్రామం హెచ్. మురవణికి వచ్చాడు. అయితే గ్రామంలో ఉన్న ఓ బావి దగ్గర సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లాడు. అయితే ఈత కొట్టేందుకు బావిలోకి దూకగా బావి నుంచి బయటకు రాలేదు. ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామంలోని కొంతమందిని విచారించగా బావివైపు వెళ్లినట్లు తెలపడంతో బంధువులు బావి దగ్గరకు వెళ్లి చూశారు. మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దకడుబూరు ఎస్ఐ నిరంజన్ తెలిపారు.

వడదెబ్బతో బాలుడి మృతి


పులికాటి శ్రీనాథ్(ఫైల్)

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో బాలుడు మృతి చెందిన సంఘటన మండలం గుడికల్లు సమీపంలో ఉన్న శ్రీరామనగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. శ్రీరామనగర్ కాలనీకి చెందిన వీరేష్, నాగవేణిల పెద్ద కుమారుడు శ్రీనాథ్(14) ఎండదెబ్బకు గురయ్యాడు. ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో కర్నూలులోని వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుండెపోటు రావడంతో మృతి చెందాడు. వీరేష్, నాగవేణిలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

కార్పొరేటర్ మృతి


గిప్సన్ (ఫైల్)

కర్నూలు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు అర్బన్ మండలంలోని 38వ వార్డు కార్పొరేటర్ రాచపూడి రవికుమార్(45) ఆలియాస్ గిప్సన్ మృతి చెందారు. ఐదేళ్ల ఆయన తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. కర్నూలులోని స్టాంటన్‌పురంలో నివాసం ఉంటున్న గిప్సన్ ఆరోగ్యం రెండు రోజుల క్రితం క్షీణించడంతో కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న ఆయన కోలుకోలేక మంగళవారం తెల్లవారు జామున 3గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, మాజీ ఎమ్మెల్యేలు జె.సుధాకర్, మణిగాంధీ, మేయర్ బీవై రామయ్య, కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబు, మేనేజరు చిన్నరాముడు, సూపరిటెండెంట్ రామకృష్ణ, కార్పొరేటర్ సాంబ తదితరులు స్టాంటన్‌పురంలోని గిప్సన్ ఇంటికి వెళ్లి ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

పాణ్యం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుపూరు వద్ద కుందూ నదిలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ మృతుడి శరీరంపై మెరూన్ ఎరుపు రంగు టీషర్ట్, దానిపై బీఎల్ అక్షరాలు ఉన్నాయని చెప్పారు. మెరూన్ ఎరుపురంగు కట్ బనియన్, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ధరించినట్లు తెలిపారు. 25 నుంచి 30 ఏళ్ల వయసు ఉంటుందని చెప్పారు. కుడి చేతిపై ఆంజనేయస్వామి పచ్చ బొట్టు, అవిధ అనే అక్షరాలు ఉన్నాయని తెలిపారు. ఎడమ చేతిపై ఫ్యామిలీ గుర్తు ఈక గుర్తు ఉందన్నారు. జీన్స్ ప్యాంట్ జేబులో పల్సర్ మోటారు సైకిల్ తాళం ఉందని, కీచైన్‌పై ఆంజనేయస్వామి గుర్తు ఉందని చెప్పారు. కుడి చేతి బొటన వేలు దగ్గర లవ్ గుర్తు కలిగిన సిల్వర్ రింగ్‌పై పీఎస్ అనే అక్షరాలు ఉన్నా యన్నారు. ఈ ఆదారాలు గుర్తించిన వ్యక్తులు పాణ్యం పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించామని చెప్పారు.

పేలిన గ్యాస్ సిలిండర్

- తృటిలో తప్పించుకున్న బజ్జీల వ్యాపారి

ఆదోని, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గణేష్ సర్కిల్ కారిబోడి కాలనీలో బజ్జీల వ్యాపారం చేస్తున్న షేక్షావలి బంకులో మంగళవారం గ్యాస్ సిలిండర్ పేలింది. బజ్జీలు వేస్తుండగా గ్యాస్ లీక్ అవడంతో మంటలు వ్యాపించాయి. ప్రమాదాన్ని గుర్తించి షేక్షావలి బంకు నుంచి బయటకు పరుగులు తీశారు. ఈలోగా గ్యాస్ సిలిండర్ భారీ శబ్దంతో పేలిపోయింది. సమాచారం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. గ్యాస్ సిలిండర్ ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడి నష్టపరిహారం వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ పేలుడుతో దాదాపు రూ. లక్ష వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు షేక్షావలి తెలిపారు.

గంజాయి తీసుకో... మద్యం బాటిల్ ఇచ్చుకో

- చిన్న పెండేకల్లులో గంజాయి సాగు
- కర్నూలు పోలీసుల అదుపులో నిందితుడు

ఆదోని రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఒక మద్యం బాటిల్ నాకివ్వు.... నీకు కావాల్సినంత గంజాయి ఇస్తా.... ఈ విష యం మనద్దరి మధ్యనే ఉండాలి... మూడో వ్యక్తికి తెలిసిందా... ఇకపై నీకు గంజాయి ఇవ్వను చూడు.... ఇదీ ఒప్పందం. కానీ ఏదో ఒక రోజు ఈ అక్రమ గంజాయి సరఫరా వ్యవహారం బయట పడు తుందని తెలుసుకోలేకపోయాడు. పోలీసులకు పట్టుబడ్డాడు. ఆదోని మండలం చిన్నపెండేకల్లు గ్రామానికి చెందిన కురువ కోదండరాముడు తన మిరప పంటలో నిత్యం గంజాయి సాగు చేస్తూ, తనకు అనుకూలమైన వారికి విక్రయించేవాడు. కర్నూలు మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ హోటల్‌లో పని చేసే కార్మికుడికి గంజాయి సరఫరా చేసేవాడు. నీకు కావాల్సినంత గంజాయి ఇస్తా... గంజాయి నీకిచ్చినప్పుడల్లా నాకు ఫుల్ బాటిల్ మందు ఇవ్వాలని కోదండరాముడు షరతు పెట్టాడు. ఈ మేరకు ఇరువురి మధ్య గంజాయి ఇవ్వడం, మద్యం తీసుకోవడం అనే వ్యవహారం సాగుతోంది.



కర్నూలులో తీగలాగిన పోలీసులు...

కర్నూలు త్రీటౌన్ పోలీసులకు అనుమానం వచ్చి ఆ హోటల్‌లో పనిచేస్తున్న కార్మికుడిని అదుపులోకి తీసుకొని విచారించడంతో గంజాయి మూలాలు బయట పడ్డాయి. ఆ హోటల్ కార్మికుడి ద్వారా పోలీసులు కోదండ రాముడుకు ఫోన్ చేయించి గంజాయి కావాలని అడి గించారు. సరే గంజాయి ఇస్తాను... నాకు మద్యం బాటిల్ తీసుకురా అని హోటల్ కార్మికుడికి కోదండరాముడు తెలిపాడు. నాలుగురోజుల క్రితం పోలీసులు రెండు వాహనాల్లో చిన్నపెండేకల్లుకు చేరుకొని హోటల్ కార్మికుడికి గంజాయి ఇస్తున్న కోదండరాముడిని అరెస్టు చేసి కర్నూలుకు తరలించారు. చిన్నపెండేకల్లు గ్రామం తాలుక పోలీస్ స్టేషన్‌పరిధికి వస్తుండడంతో నిందితుడిని త్రీటౌన్ పోలీసులు తాలుకా పోలీసులకు సోమవారం సాయంత్రం అప్పగించారు.

గంజాయి నిర్వాహకుడిని అప్పజెప్పారు..

చిన్నపెండేకల్లుకు చెందిన కురువ కోదండరాముడ్ని కర్నూలు పోలీసులు మాకు అప్పజెప్పారు. మేం విచారిస్తున్నాం. నిందితుడు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మరికొందరిని విచారిస్తున్నాం. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తాం. **- నల్లప్ప, సీఐ, ఆదోని.**

ఘర్షణలకు పాల్పడితే చర్యలు: ఎస్పీ


గ్రామంలో పర్యటిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

వెల్దుర్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. మండలంలోని బొమ్మిరెడ్డిపల్లె గ్రామాన్ని ఎస్పీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ పికెట్‌ను పరిశీలించారు. పోలీసు కవాతు నిర్వహించారు. గ్రామంలోకి వచ్చిన బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి విచారించారు. గ్రామంలో ప్రధాన వీధులు, కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం వెల్దుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి చేరుకొని పోలీసులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో కర్నూలు డీఎస్పీ ప్రసాద్‌బాబు, కర్నూలు సీఐ రామానాయుడు, వెల్దుర్తి సీఐ మధుసూదనరావు, వెల్దుర్తి ఎస్ఐ అశోక్, క్రిష్ణగిరి ఎస్ఐ మల్లిఖార్జున పాల్గొన్నారు.

ఇళ్లలో చోరీ

- బంగారు ఆభరణాలు, నగదు అపహరణ


దుండగులు ధ్వంసం చేసిన బీరువా

ఆదోని, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సమీపంలోని ఇళ్లల్లో చోరీ మంగళవారం చోరీ చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన మేరకు.. మహాబలేశ్వరప్ప అనే వ్యక్తి ఇంటికి తాళం వేసుకొని విధులకు వెళ్లాడు. వీరింటి పక్కను ఉన్న సాదాపురం గోపాల్ కూడా దానాపురంలోని ఆంజనేయస్వామి ఉత్సవాలకు వెళ్లేందుకు తాళం వేసుకొని వెళ్లారు. ఈ రెండు ఇళ్లకు తాళం వేసి ఉండడాన్ని గమనించిన దుండగులు తాళాన్ని పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. మహాబలేశ్వరప్ప ఇంట్లో బీరువాలోని ఏడు తులాల బంగారు ఆభరణాలతో పాటు, రూ. 60వేలు, అలాగే సాదాపురం గోపాల్ ఇంట్లో బీరువాలో ఉన్న ఐదు గ్రాముల బంగారం ఆభరణాలతో పాటు, రూ.లక్షను అపహరించారు. ఇంటికి వచ్చిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ రామలింగయ్య తెలిపారు.

ఆదోని మార్కెట్‌లో ఆగని వేరుశనగ గ్రేడింగ్

- అధికారుల ఆదేశాలు బేఖాతరు


వేరుశనగ దిగుబడిని గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

ఆదోని అగ్రికల్చర్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు విక్రయానికి తెచ్చిన వేరుశనగకు మహిళా కూలీల చేత గ్రేడింగ్(పాసింగ్)చేయించడంపై రైతులు ఆగ్రహం వ్యంక్తం చేస్తున్నారు. గ్రేడింగ్ చేయడం వల్ల తాము తీవ్రంగా నష్టపోవడమే కాకుండా సాయంత్రం వరకూ తూకాలు వేసుకోకుండా వ్యాపారులు ఇబ్బందులు గురి చేస్తున్నారు. దీనిపై పలుమార్లు అధికారులు గ్రేడింగ్ చేయొద్దని వేరుశనగ వ్యాపారులను హెచ్చరించి నోటీసులు జారీ చేసినా వారి ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. పొలం కల్లాలోనే, ఇంటి వద్దను విక్రయానికి తెచ్చేముందు వేరుశనగ దిగుబడిలో ఉన్న చెత్తాచెదారం, రాళ్లు, మట్టి పెళ్లలు తీసి శుభ్రం చేసుకొస్తున్నామని రైతులు చెబుతున్నారు. వ్యాపారులు మార్కెట్‌లో రైతులు తమ కమిషన్ ఏజెంట్ దుకాణాల ముందు వేరుశనగ దిగుబడిని టెండర్ కోసం రాశులుగా ఉంచితే టెండర్ వేసే సమయంలో వ్యాపారులు పలుచగా పరిచి గ్రేడింగ్ చేస్తున్నారన్నారు. రెండుసార్లు గ్రేడింగ్ చేసి చేయడం వల్ల తాము నష్టపోతున్నామని, ఇలాగే కొనసాగితే వేరే మార్కెట్ కమిటీలకు వెళ్లే పరిస్థితి వస్తుందని రైతులు హెచ్చరిస్తున్నారు. రైతులకు నష్టం కలిగించే గ్రేడింగ్ వ్యవస్థను రద్దు చేయాలని కోరుతున్నారు.

రింగ్ రోడ్డు పనులు వేగవంతం చేయాలి

- ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ వివేకానందరెడ్డి

బనగానపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో నిర్మిస్తున్న రింగ్‌రోడ్డు పనులు వేగవంతం చేయాలని ఆర్అండ్‌బీ శాఖ చీఫ్ ఇంజనీర్ వివేకానందరెడ్డి కోరారు. మంగళవారం జిల్లా ఆర్అండ్‌బీ శాఖాధికారులతో కలసి బనగానపల్లె నియోజకవర్గంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా బనగానపల్లె పట్టణ సమీపంలో రూ.50 లక్షలతో నిర్మిస్తున్న రింగ్ రోడ్డు పనులను పరిశీలించారు. పంటలు ఉండడంతో తాత్కాలికంగా రింగ్‌రోడ్డు పనులు నిలిపివేసినట్లు ఆర్అండ్‌బీ జిల్లా ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి చీఫ్ ఇంజనీర్‌కు వివరించారు. పంటలు అయిపోయిన తర్వాత రింగ్ రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే క్రిష్ణగిరి నుంచి మంగంపేట తండా వరకు జరుగుతున్న టీటీ రోడ్డు పనులను చీఫ్ ఇంజనీర్ స్వయంగా పరిశీలించారు. ఫారెస్టు క్లియరెన్సు రాకపోవడంతో కొంత భాగం పనులు ఆగిపోయాయని ఫారెస్టు క్లియరెన్సు వచ్చిన వెంటనే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లను వందశాతం పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ వెంట ఆర్అండ్‌బీ జిల్లా ఎస్ఈ మహేశ్వరరెడ్డి, ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ సునీల్‌రెడ్డి, ఏఈ హుసేన్, ఆర్అండ్‌బీ సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా బనగానపల్లె ఆర్అండ్‌బీ పనుల వేగవంతంపై అధికారులతో చీఫ్ ఇంజనీర్ సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న పనులు వేగవంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చీఫ్ ఇంజనీర్ ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు.


పనులను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ వివేకానందరెడ్డి

ఆలూరులో ఫుడ్ కమిషన్ చైర్మన్ తనిఖీలు


హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న విజయ ప్రతాప్ రెడ్డి


కస్తూర్బా విద్యార్థులతో మాట్లాడుతున్న చైర్మన్

- సంక్షేమ హాస్టళ్లు, రేషన్ దుకాణాల పరిశీలన
- నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు

ఆలూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్త విజయ ప్రతాప్ రెడ్డి మంగళవారం పర్యటించారు. మొలగవల్లి గ్రామంలో రేషన్ సరఫరా చేసే వాహనాన్ని ఆయన తనిఖీ చేశారు. సక్రమంగా నిత్యావసరాలు సరఫరా చేస్తున్నారా? లేదా? అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలూరు కేజీబీవీ స్కూల్, గిరిజన ఆశ్రమ పాఠశాల, ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌తో పాటు రేషన్ షాపును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలో సక్రమంగా భోజనం సరఫరా చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాస్టల్స్, రేషన్ షాప్స్, అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్రమంగా సరుకులు సరఫరా చేయాలన్నారు. నాణ్యమైన కూరగాయలు, గుడ్లు, సరుకులు సరఫరా చేయకపోతే కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి వరకు తనిఖీలు చేశారు. ఆయన వెంట సీఐ రవి శంకర్ రెడ్డి, తహసీల్దార్ గోవింద్ సింగ్, డీటీ దీప, ఆర్ఐ బసవన్న గౌడ్, ఏఎస్ డబ్ల్యూఓ బాబు, ప్రిన్సిపాల్స్ సుహాసిని, జమ్మన్న, వార్డెన్ మహ్మద్ అలీ, షెహనూర్ తదితరులు ఉన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



అమ్మవారికి కొబ్బరికాయలు తీసుకెళ్తున్న అర్చకులు, భక్తులు

శ్రీశైలం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం గానీ, శుక్రవారం గానీ భ్రమరాంబ అమ్మవారికి కుంభోత్సవం జరిపించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఈ ఏడాది ఏప్రిల్ 15న కుంభోత్సవం నిర్వహించ నున్నారు. అమ్మవారికి సాత్వికబలి నిర్వహించేందుకు కుంభోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. ఈ కుంభోత్సవాన్ని పురస్కరించుకొని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే వచ్చే ప్రతి మంగళవారం, శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పిస్తారు. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారి ఆలయ ప్రదక్షిన మండపములో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో పూజాధికాలు నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

● శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి) స్వామికి, నందీశ్వర స్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా మంగళవారం కడపకు చెందిన సాయి నటరాజ నృత్య అకాడమీ బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

పాణ్యం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా నెరవాడలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని అన్నారు. తల్లిదండ్రులు క్రీడల పట్ల తమ పిల్లలకు ప్రోత్సాహం అందించాలన్నారు. ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం ఆమె పిన్నాపురం లోని ఎద్దుల పందేలను ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీరామనవమి ఉత్సవ కమిటీ సభ్యులు అమరసింహారెడ్డి, నారాయణరెడ్డి, రమణారెడ్డి, మునీశ్వరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, ఎంపీటీసీ రంగరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

● నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణకొట్కూరు పీహెచ్‌సీని అన్నివిధాలుగా అభివృద్ధి పథంలో నడిపిద్దామని, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే జయసూర్య సూచించారు. బ్రాహ్మణ కొట్కూరు పీహెచ్‌సీ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. సిబ్బంది ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిధులకు సంబంధించి రికార్డులను కచ్చితంగా నిర్వహించాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యశర్మ, డాక్టర్ సరితాదేవి, నాయకులు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు మద్దూరు హరిసర్వోత్తమ రెడ్డి, మాజీ సర్పంచ్ కలీలుల్లాబేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పగిడ్యాల: బీరవోలు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త షేక్ రఫి మంగళవారం మృతి చెందారు. ఎమ్మెల్యే జయసూర్య కార్యకర్త మృత దేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. టీడీపీ మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, నాయకులు వాసురెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, విజయ్ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

మహానంది, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఎం.తిమ్మాపురంలోని పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మాతా శిశు మరణాలు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు భగవాన్‌దాస్, వెంకటరెడ్డి ఎంపీహెచ్‌ఈవో ఉసేన్‌రెడ్డి, పీహెచ్‌ఎన్ అమీనాబీ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడిపై దాడి కేసులో నలుగురి అరెస్టు

మహానంది, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): యువకుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి మంగళవారం తెలిపారు. ఫిబ్రవరి 22వ తేదిన చిత్తూరు జిల్లా మదనపల్లిలో ఉన్న గోస్పాడు మండలం జూలేపల్లెకు చెందిన రామపుల్లయ్యను కారులో తీసుకొచ్చి మహానంది మండలం శ్రీనగరం సమీపంలోని అరటి తోటలో రాళ్లతో కొట్టి, కత్తితో గాయపర్చి నట్లు చెప్పారు. గాయాలతో ఉన్న యువకుడిని చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడి పరారీలో ఉన్న నిందితులు మోహతాజ్, కరీముల్లా, ఫాతిమా బీ, రసూల్‌లను శ్రీనగరం గ్రామం సమీపంలో అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశామని చెప్పారు. నిందితులను కోర్టుకు హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

నిధులు కేటాయిస్తేనే హాజరవుతాం

● ఎంపీటీసీల నిరసన

● సర్వసభ్య సమావేశం నేటికి వాయిదా

పాములపాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నిధులు కేటాయిస్తేనే సర్వసభ్య సమావేశానికి హాజరవుతామని ఎంపీటీసీలు స్పష్టం చేశారు. మంగళవారం పాములపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉంది. అయితే ఎంపీటీసీలు వెంకటేశ్వర్లు, దుర్గాబాయి, సరస్వతమ్మ, నాగలక్ష్మమ్మ, అరుణ, రమాదేవి, బషీర్, కోఆప్షన్ మెంబర్ ముర్తుజావలితో పాటు ఇతర ఎంపీటీసీలు సమావేశానికి హాజరు కాకుండా ఎంపీడీవో కార్యా లయం ఎదుట నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎంపీటీసీలకు నిధులు కేటాయించాలని, పనులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకపోతే సర్వసభ్య సమావేశానికి హాజరు కాలేమని తేల్చిచెప్పారు. ఎంపీటీసీలు హాజరు కాకపోవడంతో సమావేశాన్ని బుధవారానికి వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు.



ఎంపీడీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎంపీటీసీలు

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

● ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



నంద్యాల క్రైం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్ నేరాలతో అప్రమ త్తంగా ఉండాలని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధితో పాటు సైబర్‌నేరగాళ్లు కూడా తమ నైపుణ్యాలను పెంచుకుంటూ ప్రజలను బురిడీ కొట్టిస్తున్నా రన్నారు. డేటా దొంగలించడం, మోసపూరిత ఫోన్ కాల్స్, ఈమెయిల్ మోసాలు, సోషల్ మీడియాలో భయపెట్టే సందేశాలు పంపడం లాంటి నేరాలకు పాల్పడుతూ అమాయకుల జేబులు ఖాళీ చేస్తున్నారన్నారు. ప్రజలకు సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించడం కోసం రద్దీప్రాంతాలు, విద్యాలయాలవద్ద సైబర్ అవేర్నెస్ పోస్టర్లను అతికిస్తున్నామని చెప్పారు. పోలీస్ సిబ్బందిని ఆయా పరిధుల్లోని విద్యాసంస్థలకు పంపి విద్యార్థులను సైబర్ వలంటీర్లుగా నమోదు చేయించి తద్వారా ఆయా కుటుంబాల్లో సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అలాగే కళాశాలలు, బ్యాంకు అధికారులు, విద్యార్థులు, ఎన్జీవో, మీడియా ప్రతినిధులను భాగస్వాములను చేస్తూ వీరందరికీ సైబర్ నేరాలపై అవగాహన చేసి తద్వారా ప్రజలను చైతన్యం చేస్తున్నామని ఎస్పీ వెల్లడించారు. ఏదైనా సైబర్ నేరాలు జరిగినపుడు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సైబర్ క్రైం పోర్టర్ ఎన్‌సీఆర్‌పీలోగాని, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సైబర్‌క్రైం.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లోగాని, 1930 నెంబర్‌కు కాల్‌చేసి గానీ, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు.

విజిబుల్ పోలీసింగ్‌తో నేర నియంత్రణ

విజిబుల్ పోలీసింగ్‌తో నేరనియంత్రణ, ప్రజల భద్రతకు భరోసా కల్పిస్తున్నట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పేర్కొన్నారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో విజిబుల్ పోలీసింగ్ నిర్వహించినట్లు తెలిపారు. వాహనాల తనిఖీ, అనుమానితుల విచారణతోపాటు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. అలాగే శక్తిటీం బృందాలు విద్యాలయాలు, షాపింగ్‌మాల్స్ ముఖ్యమైన కూడళ్లు, నేరాలు జరిగే ప్రదేశాల్లో విజిబుల్ పోలీసింగ్‌తోపాటు శక్తియాప్ డౌన్ లోడ్ చేసి దాని ప్రయోజనాలను వివరించారు.

'ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి'



రైతుకు సర్టిఫికెట్ అందజేస్తున్న వ్యవసాయాధికారులు

బండిఆత్మకూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారి నరేంద్రారెడ్డి సూచించారు. బండిఆత్మకూరు లోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ప్రకృతి వ్యవ సాయంపై ఏవో స్వాతి నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడతూ రసాయనిక, పురుగుమందుల వాడకంలో పర్యావరణం కలుషితం అయిపోయిందని, నేల కాలుష్యం అవుతోందని, ప్రకృతి వ్యవసాయం చేపట్టడం వల్ల వాటిని చాలా వరకు తగ్గించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం సాగుచేసిన రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఇటీవల వీచిన గాలి, కురిసిన వాన ధాటికి నేలకూలిన వరి పంట పొలాలను వారు పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా సిబ్బంది, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు పాల్గొన్నారు.

ఆత్మకూరు: రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని,ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించ వచ్చని ఏడీఏ ఆంజనేయ, మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, హార్టికల్చర్ అదికారి చందనలు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వెలుగు సిబ్బంది, వ్యవసాయ అనుబంధశాఖల సిబ్బందితో ప్రకృతి వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక కోసం సమావేశం నిర్వహించారు. వెలుగు సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

'వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి'



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు రఘురామ్మూర్తి

నందికొట్కూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఉభయ సభల్లో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించడం అన్యాయమని, ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా నాయకులు రఘురామ్మూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో సీపీఐ, ఏపీ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రజితమ్మ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిం చారు. రఘురామ్మూర్తి మాట్లాడుతూ గురువారం నిరసన ర్యాలీల్లో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నాయకులు మజీద్‌మియా, రహంతుల్లా, వెంకటేశ్వర్లు, పోచయ్య శ్రీరాములు, మహిళా సమాఖ్య నాయకురాలు యశోదమ్మ, రమణమ్మ, గౌండ బాబు పాల్గొన్నారు.

పొలాలకు రహదారి ఏర్పాటు



అధికారులు, పోలీసుల సమక్షంలో రోడు వేస్తున్న దృశ్యం

మిడుతూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పల దడియ గ్రామ పొలిమేరలో గత కొంత కాలం నుంచి చర్చికి చెందిన వర్గం వారికి, పొలాలకు వెళ్లే రహదారి విషయంలో రైతులకు ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. అధికారులు స్పందించి ఇరువర్గాల వారిని గొడవలు పడకుండా శాంతియుతంగా రహదారి సమస్యను మంగళవారం ఆత్మకూరు డీఎస్పీ రామంజి నాయక్, రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ ఓబులేసు పరిష్కరించారు. రైతులు పొలాలకు వెళ్లేందుకు రహదారిని అధికారుల సమక్షంలో ఏర్పాటు చేశారు.

అమ్మవారికి వెండి కిరీటం సమర్పణ



ఆలయ సిబ్బందికి కిరీటం అందజేస్తున్న భక్తులు

పాణ్యం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పాణ్యం సమీపంలో వెలసిన జంబులా పరమేశ్వరీదేవికి భక్తులు మంగళవారం వెండి కిరీటం సమర్పించారు. పాణ్యం గ్రామానికి చెందిన న్యాయవాది దివంగత ఆకుల రామకృష్ణ కుటుంబ సభ్యులు ఆయన సతీమణి ఆకుల సుజాత, కుమారులు యశ్వంత్, హేమంత్ అమ్మవారికి రూ.30 వేలు విలువ చేసే వెండి కిరీటం అందజేశారు. ఆలయ ధర్మకర్త బొమ్మిశెట్టి శేఖర్‌కు కిరీటం అందజేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సీసీటీఎన్‌ఎస్‌తో కేసుల దర్యాప్తు వేగవంతం



మాట్లాడుతున్న ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్

ఆత్మకూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): క్రైమ్ అండ్ క్రిమినల్ నెట్‌వర్క్ ట్రాకింగ్ సిస్టమ్ (సీసీటీఎన్‌ఎస్)తో కేసుల దర్యాప్తును వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాల యం లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల వివరాలను ఎప్పటికప్పుడు సీసీటీఎన్ ఎస్‌లో పొందుపర్చాలని సూచించారు. తద్వారా కేసుల, వ్యక్తుల సమా చారం అందుబాటులో ఉంటుందన్నారు. దీనివల్ల కేసుల దర్యాప్తులో పురో గతి సాధించవచ్చన్నారు. సీసీటీఎన్ఎస్ కానిస్టేబుల్, కోర్టు కానిస్టేబుల్, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు సమన్వయంతో ఉండాలని సూచించారు.

'పోషకాహారంతో ఆరోగ్యం'



శివపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

పాములపాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పోషకాహారంతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, పోషకాహారం సక్రమంగా అందించాలని ఐసీడీఎస్ ఏసీడీపీవో మంగవల్లి సూచించారు. మంగళవారం పాములపాడులో అంగన్‌వాడీ టీజర్లకు పోషణ పక్వాడ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్లు లలిత ప్రభావతి, వెంకటేశ్వరమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ పాల్గొన్నారు.

కొత్తపల్లి: గర్భిణులు జాగ్రత్తలు తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని వైద్యాధికారి చిరంజీవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం మండలంలోని శివపురం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్వాడ వేడుకలు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రారంభించారు. అనంతరం గ్రామాల్లో ఉన్న మహిళలతో అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహిం చారు. హెచ్‌ఈవో రాఘవేంద్ర, హెల్త్ ఎడ్యుకేటర్ మద్దిలేటి, హెల్త్ అసిస్టెంట్ నాగమ్మ, ఆశా వర్కర్లు అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: పిల్లలకు మొదటి 59 నెలల పాటు మంచి పౌష్టికాహారం అందివ్వాలని మండల సూపర్‌వైజర్ రమాదేవి సూచిం చారు. మంగళవారం ఎ.కోడూరు గ్రామంలో ర్యాలీతో ప్రారంభించారు. నేటి నుంచి ఈ నెల 22వ తేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు జరుగుతాయని తెలిపారు.

మహానంది: అబ్బీపురం గ్రామంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంపై మంగళవారం మండల అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ నిర్వహించారు. మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తోట కవిత ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధుల్లో పోషన్ పక్వాడా బ్యానర్‌తో అంగన్‌వాడీ టీచర్లు ర్యాలీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపునకు క్యూ కట్టారు..!

పురపాలక సంఘాల్లో ఏళ్ల తరబడి పన్ను బకాయిలు పేరుకుపోయాయి. దీంతో గత నెలలో మొత్తం వడ్డీలో 50 శాతం వడ్డీ రాయితీ ప్రకటిం చింది. అయితే పూర్తిస్థాయిలో వసూలు కాకపోవ డంతో ఈనెల 4న ప్రభుత్వం పన్నుతో పాటు వడ్డీపై 5 శాతం రాయితీ ప్రకటించింది. దీంతో నంద్యాల పట్టణ ప్రజలు పన్ను కట్టడానికి క్యూ కడుతున్నారు. మంగళవారం పురపాలక కార్యాలయంలో పన్ను చెల్లింపు కోసం క్యూ కట్టారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

\- నంద్యాల టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి)



పురపాలక కార్యాలయం వద్ద పన్ను చెల్లించడానికి క్యూలో నిల్చున్న ప్రజలు

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

సున్నిపెంట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సున్నిపెంటలోని కుమార స్వామి ఆలయంలో మంగళవారం ఏకాద శి సందర్భంగా శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. స్వామివారికి పంచామృతాధిషేకం, జలాభిషేకం, పుష్పాభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన

నంద్యాల కల్చరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నంద్యాల సంజీవనగర్ కోదండ రామాలయంలో వెలిసిన లక్ష్మీవేకంటేశ్వరుడికి, కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయంలో కాళికాంబ అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే విఘ్నేశ్వర స్వామి పంచామృత అభిషేకం, అలంకరణ, హారతి, తదుపరి మూలవిరాట్‌కు అష్టదళ పూజలు చేశారు. అనంతరం వేంకటేశ్వరుడికి, కాళికాంబ అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పాద పద్మారాధన సేవ నిర్వహించారు. భగవత్ సేవా సమాజ్ కమిటీ అధ్యక్షుడు సూరయ్య, సభ్యులు, కాళికాంబ చంద్రశేఖరస్వామి ఆలయ ఈవో లక్ష్మీనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే బుడ్డా రాక

బండిఆత్మకూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బండిఆత్మకూరుకు బుధవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి విచ్చేస్తున్నట్లు తహసీల్దార్ పద్మావతమ్మ, ఎంపీడీవో దస్తగిరి తెలి పారు. మంగళవారం వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరి ష్కారం కోసం ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తా రని తెలిపారు. ప్రజలు సమస్యలను విన్న వించుకోవచ్చని చెప్పారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ఆత్మకూరు రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని కరివేన గ్రామంలో రామాలయ కరివేన గ్రామ యూత్ సభ్యులు బాబు చౌదరి, భాస్కర్ చౌదరి ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర స్థాయి పాలబండ లాగుడు పోటీలు నిర్వహిం చారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా సీఐ రాము పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి నారాయణ రెడ్డి ఎద్దులు మొదటి బహుమతిగా రూ. 30వేలు కైవసం చేసుకోగా, మిడుతూరు గ్రామానికి చెందిన సాయివర్ధన్ ఎద్దులు రెండో బహుమతిగా రూ. 20వేలు, కొణిదేల గ్రామానికి చెందిన నరసింహుడు ఎద్దులు మూడో బహుమతిగా రూ. 15వేలు, మల్యాల గ్రామానికి చెందిన మహబూబ్ బాషా ఎద్దులు నాలుగో బహుమతిగా రూ. 10వేలు కైవసం చేసుకున్నాయి. గెలుపొందిన ఎద్దుల యజమా నులకు దాతల సహకారంతో బహుమతులు ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న వారికి, గ్రామస్థులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పగిడ్యాల: శ్రీరామనవమి సందర్భంగా పగిడ్యాలలో చెన్నకేశవస్వామి తిరునాళ్ల సందర్భంగా రైతు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 8 జతల ఎద్దులు పోటీలలో తలబడుతున్నట్లు నిర్వాహకులు వాసురెడ్డి, దామోదర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పోటీలకు వచ్చిన వారికి ఎంపీ బైరెడ్డి శబరి, బైరెడ్డి రాజశేఖరెడ్డి సూచనల మేరకు గ్రామానికి చెందిన జయరామిరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

'వంట గ్యాస్ ధర పెంచడం దారుణం'



నిరసన తెలుపుతున్న నాయకులు

నంద్యాల రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వంటగ్యాస్ ధర రూ.50 పెంచడం దారుణమని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి అన్నారు. గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని సాయిబాబా సర్కిల్ వద్ద నిరసన చేపట్టారు. ఆమె మాట్లాడుతూ దేశంలో ఇప్పటికే నిత్యవసర ధరలు పెరిగి సామాన్యుడు కొనలేని తినలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

సున్నిపెంట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సున్నిపెంటలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మంగళవారం ఈగల్ క్లబ్ ఎలైట్ సంస్థ ఆధ్వర్యంలో డ్రగ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.బుచ్చయ్య, డాక్టర్ సాహెల్, గురు క్లబ్ అధ్యక్షుడు పూర్ణేశ్వర్ రెడ్డి, ఇందిరా ప్రియదర్శిని, డాక్టర్ పద్మ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ శివనాగిరెడ్డి, మహేశ్వరరెడ్డి, బాలు, కళ్యాణి, రజాక్, నాగరాజు పాల్గొన్నారు.

'వేసవిలో జాగ్రత్తలు పాటించాలి'

వెలుగోడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖరరెడ్డి, సర్పంచ్ జయపాల్ అన్నారు. మంగళవారం వెలుగోడు పట్టణంలోని ప్రధాన సెంటర్లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈవోఆర్డీ గంధం మురారి, పంచియతీ కార్యదర్శి జాలె సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

మహానంది, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మహానంది మండలంలో ఇటీవల వీచిన ఈదురు గాలులకు తోడు వర్షానికి దెబ్బతిన్న అరటి చెట్లతో పాటు తడిసిన పసుపు పంటను నంద్యాల, ఆళ్లగడ్డ డివిజన్ ఉద్యానవనశాఖాధికారి ఎం. శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా రైతులకు ఉద్యావన పంటలను అకాల వర్షాలు సంభవించినప్పుడు పంటలను ఎలా కాపాడుకోవాలన్న అంశంపై అవగాహన కల్పించారు.

'సౌరశక్తిని ఉపయోగించుకోవాలి'

బండిఆత్మకూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సౌరశక్తిని ఉపయోగించాలని ప్రజలకు మండల స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ రెహమాన్ సూచించారు. మంగళవారం మండలంలోని బి.కోడూరు గ్రామంలో సౌర్యమర్‌పై ప్రజలకు అవగహన కల్పించారు. ప్రభుత్వం సబ్సిడీపై సౌరశక్తి కనెక్షన్ అమరుస్తుందని, దీంతో సూర్యకిరణాల ద్వారా విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. ఏఈ కంభగిరి, ఈవోఆర్డీ రామకృష్ణవేణి, కార్యదర్శి రామగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పాములపాడు: ప్రధాన మంత్రి సూర్యఘర్ పతకం గురించి మండల ప్రత్యేక అధికారి రాజు, ఎంపీడీవో చంద్రశేఖర్, విద్యుత్‌శాఖ ఏడీ రామ సుబ్రహ్మణ్యం మంగళవారం ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పాములపాడు ఎస్సీ కాలనీలో ప్రజలతో వారు మాట్లాడారు. ఈవోఆర్డీ రామునాయక్, పీఎస్ నాగేషులు, లైన్‌మన్ ఆచారి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

1,100 క్యూసెక్కులు విడుదల

నంద్యాల మున్సిపాలిటీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సుంకేసుల బ్యారేజీ దగ్గర ఉన్న లాకిన్సలా నుంచి కేసీ ప్రధాన కాలువకు 1100 క్యూసెక్కుల నీటిని మంగళవారం రాత్రి విడుదల చేసినట్లు కేసీ ఈఈ ప్రతాప్, డీఈ రవికుమార్ తెలిపారు. ఈ నీటిని కేవలం నీటి ఎద్దటి ఎదుర్కొంటున్న గ్రామాల్లోని నీటి కుంటలను నింపుకోడానికి మాత్రమే ఈ నీటిని వదిలినట్లు తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

నందికొట్కూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): చెట్లు పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని మున్సిపలల్ కమీషనర్ బేబి అన్నారు. మంగళవారం పట్టణంలోని సంతపేట ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం నారాయణస్వామి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమీషనర్ బేబి పాల్గొని మొక్కలు నాటారు. ఎంసీవోలు సుభాన్, శ్రీనివాసులు, విద్యా కమిటీ ఛైర్మన్ సాదీ చాంద్, 8వ వార్డు ఇన్‌చార్జి శాలు, పట్టణ ప్రముఖులు అల్వాల రామ్మూర్తి తదితరులు హాజరయ్యారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి



మంత్రికి వినతిపత్రాన్ని ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

బనగానపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సత్యప్రకాశ్, జిల్లా ఆడిట్ కన్వీనర్ దస్తగిరి కోరారు. మంగళవారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల యూటీఎఫ్ అధ్యక్షుడు ప్రతాప్, జిల్లా కౌన్సిలర్ నాగరాజు, కార్యదర్శి వీరకుమార్‌రెడ్డి, హుసేన్, సతీశ్‌కుమార్, యు.దస్తగిరి దితరులు పాల్గొన్నారు.

అహోబిలంలో ఏకాదశి వేడుకలు

ఆళ్లగడ్డ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో మంగళవారం చైత్ర ఏకాదశి(కామద ఏకాదశి) పర్వదినం సందర్భంగా ప్రహ్లాద వరద స్వామి, అమృత వల్లి అమ్మవార్లకు వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. అలాగే ఎగువ అహోబిల క్షేత్రంలో కూడా జ్వాలా నరసింహస్వామి చెంచులక్ష్మి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వార్లను దర్శించుకున్నారు.

నేటి నుంచి రేవనూరులో ఉరుసు

కోవెలకుంట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రేవనూరు గ్రామంలో వెలసిన హజ్రత్ హుసేనీవలి స్వామి ఉరుసు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా నిర్వాహకులు ముతవల్లి ఎం.గఫారియా తెలిపారు. బుధవారం గంధం, అదేరోజు రాత్రి ఖవ్వాలి, గురువారం ఉరుసు మేళా, శుక్రవారం జీయారత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

వీఆర్వోల సంఘం మండల కార్యవర్గం ఎన్నిక

డోన్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల సంఘం మండల కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నిక చేసినట్లు ఆ సంఘం నాయకులు మంగళవారం తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా మల్లారెడ్డి, రామ కృష్ణారెడ్డి, సెక్రటరీగా మంజుల, జాయింట్ సెక్రటరీగా గోవిందు, ట్రెజరర్‌గా అబ్దుల్ యూనుస్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జి.మనోహర్, సత్యనారాయణ, పెద్దక్క, భీమేశ్వరి, భాస్కర్ నాయుడు, కృష్ణమూర్తి, పెద్దయ్య, మహానంది, మనోహర్, గంగాధర్, వెంకట్రాముడు, బాలప్ప, మాదవస్వామి, రామాంజనేయులు, కైలాష్, హనుమంతు, ఖాజా, రత్నమ్మ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఖాజాహుసేన్

బనగానపల్లె, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కె. ఖాజాహుసేన్, జనరల్ సెక్రటరీగా శ్రీనివాసమూర్తి, వైస్ ప్రెసిడెంట్‌గా జాకీర్‌హుసేన్, జాయింట్ సెక్రటరీగా అల్లాఉద్దీన్, కోశాధికారిగా విజయభాస్కర్, లైబ్రరీ సెక్రటరీగా ముజఫర్ హుసేన్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు సీనియర్ న్యాయవాది బాబాఫకృద్దీన్ తెలిపారు.

ఆలయానికి విరాళం

రుద్రవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాసాపురం వెంకటేశ్వరస్వామికి వెండి తొడుగు తయారు చేయించేందుకు గంగిశెట్టి తిమ్మయ్య, రమాదేవి దంపతులు మంగళవారం రూ.1.50 లక్షలు ఆర్థికసాయం అందించారు. ఈ విరాళాన్ని చైర్మన్ మధుసూదనరెడ్డికి అందించారు. అలాగే ప్రతాపరుద్ర ఆంజనేయస్వామి దేవాలయానికి బండారు నడిపిలాలు స్వామి రూ.10,116 విరాళం అందించారు.

వైభవంగా గ్రామోత్సవం

రుద్రవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరంలో పడమటి వీధిలో ప్రతాపరుద్ర ఆంజనేయస్వామి ధ్వజ శిఖర కలశ ప్రతిష్ఠ పూజలు మంగళవారం నిర్వహించారు. అర్చకులు వారణాసి గోపిశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. ధ్వజస్తంభ గ్రామోత్సవం భక్తులను ఆకట్టుకుంది. చెక్కభజన బృందం నృత్యాలు ఆకట్టుకున్నాయి.

రైతులకు చెక్కుల పంపిణీ

ఉయ్యాలవాడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు భూములు ఇచ్చిన రైతులకు చెక్కులను అందించినట్లు డిప్యూటీ తహసీల్దారు ప్రసాదుబాబు తెలిపారు. మంగళవారం గోవిందపల్లె, మాయలూరు గ్రామాలకు చెందిన 19 మంది రైతులకు రూ.7.43 లక్షల చెక్కులు తహసీల్దారు కార్యాలయంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి నరేంద్రచౌదరి, ఆర్ఐ అంకన్న, వీఆర్వోలు ఉన్నారు.

మరమ్మతులకు మోక్షం ఎప్పుడో?

- కోతకు గురైన గంగ బ్లాక్ ఛానెళ్ల గట్లు
- చుట్టూ ఏపుగా పెరిగిన కంపచెట్లు
- బలోపేతం చేయాలని రైతులు వేడుకోలు

రుద్రవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : తెలుగుగంగా ప్రధాన కాల్వ గట్లు కోతకు గురవుతున్నాయి. తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి మెట్ట భూములకు సాగునీరందించేందుకు గంగ బ్లాక్‌ఛానెళ్లు తవ్వించారు. జిల్లాలో లక్షా 16వేల ఎకరాలు ఆయకట్టు భూములు ఉన్నాయి. 1 నుంచి 39 వరకు బ్లాక్‌ఛానెళ్లు ఉన్నాయి. వీటిలో 16 నుంచి 39 వరకు ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం, శిరివెళ్ల, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల్లో కాల్వలు విస్తరించి ఉన్నాయి. గట్లు బలహీనంగా చేరి ఎక్కడి పడితే అక్కడ కోతకు గురవుతున్నాయి. రైతులు పంట పొలాలకు వెళ్లేందుకు వీలు లేకుండా గట్లపైన ఏపుగా కంపచెట్లు పెరిగాయి. రాకపోకలకు కూడా కష్టతరమైందని ఆవేదన వ్యక్తం చేశారు. గట్లను బలోపేతం చేయక పోతే తరచూ గండ్లు పండి సాగునీరు వృథా అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గట్లకు మరమ్మతులు చేయిస్తే చివరి ఆయకట్టుకు సాగునీరందతుందని, గంగ బ్లాక్‌ఛానెళ్ల గట్లకు వేసవిలో మరమ్మతులు చేయించాలని, కంపచెట్లు తొలగించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



అప్పనపల్లె సమీపంలో కోతకు గురైన గంగ బ్లాక్‌ఛానెల్ గట్టు





పెద్దకంబలూరు సమీపంలో 18వ గంగ బ్లాక్‌ఛానెల్ వద్ద ఇలా..

ప్రతిపాదనలు పంపించాం

గంగ బ్లాక్‌ఛానెళ్లతో పాటు మెయిన్ కెనాల్ గట్టుపై కంపచెట్లు తొలగించేందుకు బ్లాక్‌ఛానెళ్లకు మరమ్మతులకు నివేదికలు పంపించాం. బ్లాక్ చానెళ్ల, డిస్ట్రిబ్యూటర్ చానెళ్ల గట్లపై ఇన్‌స్పెక్షన్ ట్రాక్ ఏర్పాటు చేయడానికి కూడా నివేదికలు పంపించాం.

- రామశేషు, తెలుగుగంగ ఏఈ

వైభవంగా చౌడేశ్వరి జ్యోతి మహోత్సవాలు

బేతంచెర్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల పట్టణ శివారులోని కొలుములపల్లె రస్తాలో వెలసిన చౌడేశ్వరి దేవి తిరునాళ్ల జ్యోతి మహోత్సవాలు వైభవంగా మంగళవారం నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి గౌరిపేటలో వెలసిన గ్రామ దేవతా సుంకులా పరమేశ్వరి దేవి ఆలయం వద్ద నుంచి 21 జ్యోతుల మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసి పట్టణ పురవీధుల గుండా జ్యోతులను ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దేవతామూర్తుల వేషాధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అమ్మవారిశాల మీదుగా ఉదయం 7 గంటలకు జ్యోతులు దేవస్థానానికి చేరుకున్నాయి. ముందుగా ఉదయం అమ్మవారికి అభిషేకాలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. అనంతరం మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మల్లు సుబ్బారెడ్డి, గౌరు హుశేన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, మల్లిపెద్ది రఘురామిరెడ్డి, రామస్వామి, శ్రీనివాసులు, పలువురు ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



చౌడేశ్వరి దేవి గ్రామోత్సవంలో పాల్గొన్న మహిళలు

ప్రజలకు అవగాహన కల్పించండి

డోన్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆర్డీవో నరసింహులు అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సచివాలయం, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటే విద్యుత్ బిల్లు తక్కువ వస్తుందని, అదేవిధంగా ప్రభుత్వం నుంచి సబ్సిడీ లభిస్తుందని ప్రజలు వినియోగించుకునేలా చైతన్యం కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరు సోలార్ నిర్మించుకుంటే కరెంటు ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, తహసీల్దార్ నాగమణి, ఎంపీడీవో వెంకటేశ్వరరెడ్డి, ఎలక్ట్రికల్ ఈఈ కమలాకర్‌రావు, ఏఈ నాగేశ్వరరెడ్డి, ఈవోఆర్డీ ఫకృద్దీన్, సచివాలయం, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో నరసింహులు

అనుమతి లేకుంటే అడ్డుకోవాలి: ఎస్పీ

ప్యాపిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లాలో పర్యటిస్తున్న మాజీ సీఎం జగన్ సభకు అనుమతి లేని వాహనాలను అడ్డుకోవాలని నంద్యాల జిల్లా ఎస్పీ అధిరామ్ సింగ్ రాణా స్థానిక పోలీసులకు సూచించారు. మంగళవారం అనంతపురం జిల్లాలో మాజీ సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో ఎస్పీ ప్యాపిలి మండలంలోని జిల్లా సరిహద్దు ప్రాంతాన్ని తనిఖీ చేశారు. డ్రోన్ పని తీరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జగన్ పర్యటనకు వెళ్లడానికి ఎవరికి అనుమతులు లేవన్నారు. ఎవరైన సభకు అనుమతి లేకుండా వెళ్తే కట్టడి చేయాలన్నారు. ప్యాపిలి, డోన్, బేతంచెర్ల మండలాలకు చెందిన సీఐ, ఎస్‌ఐలు ఆయన వెంట పాల్గొన్నారు.



డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ

రూ. ఆరువేల జరిమానా

కోవెలకుంట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి చేసిన లారీ డ్రైవరు షేక్ మహబూబ్‌బాషాకు రూ. ఆరువేల జరిమానా విధిస్తూ కోవెలకుంట్ల జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి షేక్ అబ్దుల్‌రహిమాన్ తీర్పునిచ్చినట్లు రేవనూరు ఎస్‌ఐ భూపాలుడు తెలిపారు. మంగళవారం ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు 2019 జనవరి 2న నంద్యాల నుంచి అనంతపురం వెళ్తున్న లారీని రేవనూరు పోలీసుస్టేషన్ వద్ద పోలీసులు ఆపేందుకు ప్రయత్నించగా డ్రైవరు ఆపకుండా వెళ్లడంతో సిబ్బంది కలుగొట్లకు వెళ్లి అక్కడ లారీని ఆపే ప్రయత్నం చేశారు. దాంతో లారీ డ్రైవర్ షేక్ మహబూబ్‌బాషా డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి చేశాడు. దాంతో లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం సాక్ష్యం రుజువు కావడంతో న్యాయాధికారి లారీ డ్రైవరుకు జరిమానా విధించారు.

గుర్తింపు పొందాలి

డోన్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మాదాసి, మాదారి కురువలు అన్ని రంగాల్లో రాణించి మంచి గుర్తింపు పొందాలని కురువ సంఘం రాష్ట్ర కోశాధికారి మద్దిలేటి అన్నారు. ఇటీవల డోన్ బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా ఎన్నికైన న్యాయవాది జే.రవి మోహన్, ఇండియన్ రెడ్ క్రాస్ అధికార ప్రతినిధి కొచ్చెర్వు వెంకటేశ్వర్లును మంగళవారం కురువ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి, టీడీపీ నాయకులు ఆలేబాదు పరమేష్, బత్తిన మునిస్వాము, మేఘవర్షుడు, ఫక్కీరప్ప, జయరాముడు, ఓబులేసు, బాలమద్దయ్య, శ్రీను పాల్గొన్నారు.

కోవెలకుంట్లలో మెగా వైద్యశిబిరం

కోవెలకుంట్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలో శాంతిరామ్ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మెగా మెడికల్ క్యాంపు, ఫోకస్ క్యాంపు నిర్వహించారు. ఈవో ప్రకాశ్‌నాయుడు శిబిరాన్ని ప్రారంభించి మందులు పంపిణీ చేశారు. అలాగే కంటికి సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాంతిరామ్ సేవా సమితి పీఆర్వో వైవీ రమణ, డి.కిశోర్‌బాబు, ఓబులేసు, నాగరాజు పాల్గొన్నారు.

పన్నులపై రాయితీ సద్వినియోగం చేసుకోండి

డోన్ టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు 2025-26 మొదటి, రెండో అర్ధ సంవత్సరం ఆస్తి పన్ను మొత్తం చెల్లిస్తే ఐదుశాతం డిస్కౌంటు పొందవచ్చని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బాలిక అదృశ్యం..కేసు నమోదు

రుద్రవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక సోమవారం అదృశ్యమైనట్లు బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ బాలన్న తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఓ యువకుడిపై అనుమానం ఉన్నట్లు బాలిక తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొలిమిగుండ్లలోని చౌడమ్మ, పెద్దమ్మ, బెలుం శింగవరం వీరబాపులమ్మ, గొర్విమానుపల్లె పెద్దమ్మ, అంకిరెడ్డిపల్లె సుంకులమ్మ, పెద్దమ్మ, అబ్దులాపురం, మదనంతపురం, కనకాద్రిపల్లె తదితర గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి, పూజలు చేశారు. జంతు బలి గావించి మొక్కులు చెల్లించారు.

మాతాశిశు సంరక్షణ అందరి బాధ్యత

చాగలమర్రి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : మాతా శిశు సంరక్షణ అందరి బాధ్యతని వైద్యశాఖ జిల్లా నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో ఆశా డే సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని రకాల సర్వేలను వంద శాతం పూర్తి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య సంక్షేమ పథకం కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవడం వల్ల రూ.5 లక్షల వరకు వైద్య సేవలు పొందవచ్చని అన్నారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఇమ్రాన్, అంజలి, సీహెచ్‌వో రమణమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


చాగలమర్రి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కరీం బాషా తెలిపారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం కార్యాచరణ ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. చీడపీడలు, భూసార పరీక్షల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈవో మంజుల, ఎంటీఎస్ నాగేశ్వరరెడ్డి, రామాంజనేయరెడ్డి, యూనిట్ ఇంచార్జి నిరంజన్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆశా కార్యకర్తను విధుల్లోకి తీసుకోవాలి'

బేతంచెర్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్షతో తొలగించిన ఆశా వర్కర్ విమలమ్మను విధుల్లోకి తీసుకోవాలని బేతంచెర్ల మండలం ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు పుష్ప, సుజాత కోరారు. మంగళవారం ఆర్ఎస్ రంగాపురం ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్ అబ్దుల్ హలీమ్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో శాంతమ్మ, నాగమ్మ, ధనలక్ష్మి, పుష్పావతి, లక్ష్మీదేవి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

సిమెంట్ పరిశ్రమలపై కాటసాని ఆగ్రహం

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధికారంలో ఉండగా తమ చుట్టూ తిరిగి, తమ దయాదాక్షిణ్యాలతో సిమెంట్ పరిశ్రమలు నెలకొల్పి, ఇప్పుడు తమను ఏమాత్రం లెక్క చేయడంలేదంటూ బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సిమెంట్ పరిశ్రమలపై కన్నెర్రజేశారు. మంగళవారం కొలిమిగుండ్ల వైసీపీ కార్యాలయంలో నూతన కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిమెంట్ పరిశ్రమలు తమ నాయకులకు, కార్యకర్తలకు కాంట్రాక్టులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మరోవైపు వైసీపీ అధికారంలో ఉండగా పార్టీ కింది స్థాయి కార్యకర్తలను పట్టించుకోలేదని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అంగీకరించారు. ఈసారి అధికారంలోకి వస్తే అలా జరగదని, కార్యకర్తలకు భరోసా కల్పించే ప్రయత్నం చేశారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, వైస్ ఎంపీపీ క్రిష్టారెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు పేరం నందకిశోర్‌రెడ్డి, నాయకులు మొలక రాజారెడ్డి, అంబటి చంద్రమోహన్‌రెడ్డి, సత్యాల్‌రెడ్డి, రామాంజనేయులు, నూతన కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాటసాని

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

- ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి

డోన్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం శ్రమిస్తుందని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.3.50 లక్షల చెక్కును వెంకటనాయునిపల్లె గ్రామానికి చెందిన బాధిత కుటుంబ సభ్యుడు బోయిని శ్రీనివాసులుకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు, వాస్తు లక్ష్మన్న ఘన మద్దయ్య తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి: ఎంఈవో

డోన్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని డోన్ మండల విద్యాధికారి ప్రభాకర్ కోరారు. మంగళవారం మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో డోన్‌ప్రాథమిక పాఠశాలలో పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చదువులో, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు బహుమతులు అందజేశారు. ఎంఈవో ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రంగనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరామనవమి వేడుకలు

డోన్ రూరల్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలాపురం గ్రామంలో మంగళవారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా ముగిశాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు గ్రామంలో ఎవర్ గ్రీన్ ఈవెంట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హైదరాబాదు నుంచి ప్రత్యేక కళాకారులతో నృత్యాలు, మిమిక్రీ చేశారు. మంగళవార ఉదయం వేర్వేరు కేటగిరి ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. గెలుపొందిన విజేతల వృషభాల యజమానులకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ప్యాపిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రపల్లి గ్రామంలో కోదండరాముల స్వామి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పోటీలను టీడీపీ సీనియర్ నాయకులు వై లక్ష్మీనారాయణయాదవ్ ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీలను వివిధ గ్రామాల ప్రజలు తిలకించారు.



చంద్రపల్లిలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణ

ముగిసిన కబడ్డీ పోటీలు

ప్యాపిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రపల్లి గ్రామంలో కోదండరాములస్వామి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీల్లో పదిజట్లు ఎద్దులు పాల్గొనగా గోనెగండ్లకు చెందిన జట్టు మొదటి స్థానం, రెండవ స్థానంలో మండలంలోని చంద్రపల్లి జట్టు, మూడవ స్థానంలో బావిపల్లి, నాల్గవ స్థానంలో గుడిపాడు జట్టు నిలిచాయి. గెలుపొందిన జట్లకు వరుసగా రూ.35వేలు, రూ.25వేలు, రూ.15వేలు, రూ.5వేలు నిర్వాహకులు వై లక్ష్మీనారాయణ యాదవ్ అందజేశారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్యాపిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సొసైటీ ఫర్ వర్కింగ్ ఎడ్యుకేషనల్ ట్రైనింగ్ హ్యూమన్ యాక్టివిటీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో 73 మంది రక్తదానం చేశారు. తలసేమియాతో బాధపడుతున్న వారికి కర్నూలులోని న్యూ లైఫ్ బ్లడ్ బ్యాంక్ నుంచి రక్తం ఉచితంగా ఇస్తామని సంస్థ నిర్వాహకులు కొండలరావు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఈవోఆర్డీ బాలక్రిష్ణుడు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలి: సీఐ

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు, అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని సీఐ రమేష్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళా పోలీసులతో సీఐ సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల నుంచి సమగ్ర సమాచారం అందించడంలో మహిళా పోలీసులు కీలక పాత్ర పోషించాలని సీఐ సూచించారు. ఏలాంటి ఘటనలు జరిగినా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకరావాలన్నారు. విధుల పట్ల ఎలాంటి అలసత్వం ప్రదర్శించరాదని సూచించారు.

ఈ-శ్రమ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోండి

కొలిమిగుండ్ల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అసంఘటిత కార్మికులందరూ తప్పనిసరిగా ఈ-శ్రమ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని బనగానపల్లె సహాయ కార్మికశాఖ అధికారి శోభారాణి సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈనెల 17వరకు కార్మిక శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ప్రత్యేక రిజిస్ట్రేషన్ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16సంవత్సరాల నుంచి 59సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి కార్మికుడు ఈ-శ్రమ్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

వైభవంగా సీతారాముల పాన్పుసేవ

చాగలమర్రి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : చాగలమర్రి గ్రామంలోని కోదండ రామ పట్టాభిరామ ఆలయాల్లో మంగళవారం అత్యంత వైభవంగా సీతారాముల పాన్పు సేవా కార్యక్రమం నిర్వహించారు. మహిళలు సీతారాముల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేదపండితుల ఆధ్వర్యంలో సీతారాముల నవరాత్రుల ఉత్సవాల ముగింపు సందర్భంగా లోక కల్యాణార్థం ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ అభిషేకాలు చేశారు. మహిళలు భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



కోదండ రామాలయంలో పాన్పుసేవ చేస్తున్న మహిళలు

ఆలయ ఉత్సవ కమిటీ ఎన్నిక

అవుకు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎర్రమల కొండల్లో వెలసిన శ్రీలక్ష్మీ కంబగిరిస్వామి ఆలయ నూతన ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా దేవాదాయ శాఖ అధికారులు ఎంపిక చేసినట్లు కునుకుంట్ల నాయకులు గూడాల ప్రతాప్ రెడ్డి, మురళీధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ కంబగిరిస్వామి ఆలయంలో మంగళవారం నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయని అన్నారు. తొమ్మిది మంది సభ్యులతో నూతన ఉత్సవ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 12న జరిగే స్వామి వారి కల్యాణోత్సవానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరవుతారన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు ప్రతాప్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి